

# సూర్య

నేటి దినపత్రిక

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు

www.suryaa.com

14 జులై 2025 పేజీలు : 08 సోమవారం




# కిడ్నీ రోగుల వర ప్రదాయినిగా డయాలసిస్ కేంద్రం

- పొదలకూరులో సోమిరెడ్డి కృషితో ఏర్పాటు
- సోమిరెడ్డికి ధన్యవాదాలు తెలుపుతున్న కిడ్నీ రోగులు

**పొదలకూరు, మేజర్‌న్యూస్ :**

ఒకటిన్నర కోట్లతో పొదలకూరులో ఏర్పాటు చేసిన డయాలసిస్ కేంద్రం కిడ్నీ రోగుల పాలిట వరప్రదాయినిగా మారింది. సర్వేపల్లి నియోజకవర్గంలో మెట్ట ప్రాంతమైన పొదలకూరు అభివృద్ధిలో సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి స్థానం ప్రత్యేకం. రాపూరు, సైదాపురం, కలువాయి, చేజర్ల, మనుబోలు మండలాల నుంచి కిడ్నీ రోగులు సుదూర ప్రాంతం ప్రయాణం చేసి నెల్లూరులోని వైద్యాశాలాల్లో డయాలసిస్ చేయించుకోవాల్సిన పరిస్థితి. ఈ ప్రాంతం నుంచి వ్యయ, ప్రయాసాలకోర్చి నెల్లూరు చేరుకుని డయాలసిస్ చేయించుకునే కిడ్నీ రోగుల పరిస్థితి వర్ణనాతీతంగా ఉండేది. గమనించిన ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి పొదలకూరు సామాజిక ఆరోగ్య కేంద్రంలో డయాలసిస్ కేంద్రం ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. అనుకున్నదే తడవుగా రూ.1.5 కోట్లతో ఐదు యూనిట్లతో డయాలసిస్ కేంద్రాన్ని మంజూరు చేయించారు. ఇందుకోసం ఒక ప్రత్యేక గదిని తయారు చేయించడంతోపాటు ఆ భవన నిర్మాణ పనుల కోసం తన సొంత నిధులు 3 లక్షల రూపాయలు ఖర్చు చేసి పేదల పట్ల తనకున్న నిబద్ధతను చాటుకున్నారు. రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌ను పొదలకూరు తీసుకొచ్చి డయాలసిస్ కేంద్రాన్ని ప్రారంభోత్సవం చేయించారు. కిడ్నీ రోగులకు సౌలభ్యంగా ఉండేలా అన్ని వసతులు కల్పించారు. అంతేకాకుండా రూ.42 లక్షలు సిఎస్ఆర్ నిధులతో మరో మూడు డయాలసిస్ యూనిట్లు ఏర్పాటు చేయించారు. అలాగే వైద్యశాలకు క్లీనింగ్ అనలైజర్, జనరేటర్ సౌకర్యం కల్పించారు. ఇప్పుడు ఈ డయాలసిస్ కేంద్రంలో 24 మంది కిడ్నీ రోగులు తమ పేర్లను నమోదు చేసుకొని ఒక నెలలో 280 సార్లు డయాలసిస్

## సౌకర్యవంతంగా ఉంది..

**- వెంకటసుబ్బయ్య, రాపూరు**



గతంలో తాను నెల్లూరు నారాయణ వైద్యశాలలో డయాలసిస్ చేయించుకునే వాడిని. రాపూరు నుంచి 140 కిలోమీటర్లు ప్రయాణం చేయాల్సి వచ్చేది. వారానికి మూడుసార్లు డయాలసిస్ చేయించుకోవాల్సిన పరిస్థితి. పొదలకూరులో డయాలసిస్ కేంద్రం ఏర్పాటు చేయడంతో దూరం తగ్గడంతో ప్రస్తుతం వారానికి రెండుసార్లు డయాలసిస్ చేయించుకుంటే సరిపోతుంది. పొదలకూరులో డయాలసిస్ కేంద్రం ఏర్పాటు చేయడం మాకు చాలా సౌకర్యవంతంగా ఉంది.

## ఖర్చులు తగ్గాయి..

**ప్రసన్న, తోపుగుంట, కలువాయి మండలం**



నేను కలువాయి మండలం తోపుగుంట నుంచి వారానికి మూడు సార్లు నెల్లూరు నారాయణ హాస్పిటల్‌కు వెళ్లి డయాలసిస్ చేయించుకునే దాన్ని. నాకు వచ్చే పది వేల రూపాయల పెన్షన్ చార్జీలు, ఆటో బాడుగులకి సరిపోయేది. పొదలకూరులో డయాలసిస్ కేంద్రం ఏర్పాటు చేయడంతో మాకు ఖర్చులు తగ్గాయి. దూరం తగ్గడంతో ఆయాసం తగ్గి వారానికి రెండుసార్లు డయాలసిస్ చేయించుకుంటే సరిపోతుంది. పొదలకూరులో డయాలసిస్ కేంద్రం ఏర్పాటు చేయించిన సోమిరెడ్డి సార్‌కి ధన్యవాదాలు.

---

స్థానిక ఎన్నికలను ఎదుర్కొనేందుకు

# సిద్ధం కండి !




వివరాలు 2లో

సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని ప్రజల్లోనికి తీసుకువెళ్లండి

నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశంలో ఎమ్మెల్యే కాకర్ల సురేష్

---

# చిల్డ్రన్స్ పార్కులో ఘనంగా సిల్వర్ జూబ్లీ వేడుకలు

## ముఖ్యతిథిగా హాజరైన మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ

- చిల్డ్రన్స్ పార్క్ 25 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా 25 మొక్కలను నాటిన మంత్రి నారాయణ
- చిల్డ్రన్స్ పార్క్‌ను రూపురేఖలు మారుస్తా.. బెస్ట్‌పార్కుగా చేసి చూపిస్తా
- కేంద్ర ప్రభుత్వం ద్వారా స్వచ్ఛ భారత్ 5 అవార్డులు ఆంధ్రాకు ప్రకటించడం సంతోషం
- శుభ్రతకు నెల్లూరును రోల్ మోడల్‌గా మారుస్తా..



**నెల్లూరు అర్బన్/క్రైమ్, మేజర్‌న్యూస్ :**

చిల్డ్రన్ పార్క్ నిర్మించి 25 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సిల్వర్ జూబ్లీ వేడుకలు ఆదివారం అట్టహాసంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి రాష్ట్ర పట్టణ పురపాలక శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. చిల్డ్రన్స్ పార్క్ విచ్చేసి మంత్రికి వాకర్స్ అసోసియేషన్ సభ్యులు శాలువాలతో ఘనంగా సత్కరించారు. ముందుగా

మిగతా 2

---

ప్రమాణాలు పాటించని హెూటల్లపై

# కఠిన చర్యలు తప్పవు



- ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ చైతన్య

**నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :**

నగర పాలక సంస్థ పరిధిలోని అన్ని రెస్టారెంట్లు, హెూటళ్లలో కార్పొరేషన్ నిర్దేశించిన ప్రజారోగ్య ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని, నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ చైతన్య హెచ్చరించారు. స్థానిక ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని శ్రీనివాస భవన్ హెూటల్‌ను డాక్టర్ ఆదివారం ఆకస్మికంగా తనిఖీ

-మిగతా 2లో

# స్థానిక ఎన్నికలను ఎదుర్కొనేందుకు సిద్ధం కండి !

**వింజమూరు, మేజర్‌న్యూస్ :** తెలుగుదేశం పార్టీ అధిష్టానం మాటే శిరోధార్యంగా ప్రతి ఒక్కరూ పని చేయాలని, ప్రజలకు సేవ చేసేందుకు పదవులు ముఖ్యం కాదని, పార్టీలో కష్టపడితే పదవులు వాటి అంతట అవే వస్తాయని ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ పేర్కొన్నారు. ఆదివారం వింజమూరులోని టీడీపీ ప్రధాన కార్యాలయంలో నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి గ్రామ, మండల పార్టీ కమిటీ ఎన్నిక నియోజకవర్గ పరిశీలికులు వల్లభనేని సుబ్బారావు, నియోజకవర్గ పార్టీ పరిశీలికులు వికాస్ హరికృష్ణ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ముందుగా అతిధులను శాలువాలతో ఘనంగా సన్మానించి, పూల మొక్కలను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. స్థానిక ఎన్నికలను ఎదుర్కొనేందుకు ప్రతి కార్యకర్త నాయకులు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో 175 నియోజకవర్గాలలో 12వ స్థానంలో ఉన్నామని, దీనిని పది రోజుల లోపల 70 శాతానికి తీసుకెళ్లడమే లక్ష్యంగా ఎనిమిది మండలాల నాయకత్వం పనిచేయాలని తెలిపారు. గతంలో మాదిరిగా కాకుండా, పార్టీలో కష్టపడిన వారికి పదవులు దక్కాలన్న ఉద్దేశంతో నియోజకవర్గంలో సుమారు 90 పంచాయతీలలో తిరిగి గ్రామ కమిటీలను ఎన్నిక చేయడం జరిగిందన్నారు. పదవులు లేవని అధైర్య పడవద్దని, తెలుగుదేశం కార్యకర్త గొప్ప పదవి అని తెలిపారు. పార్టీ అధినేత ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, యువ నాయకుడు




మంత్రి నారా లోకేష్ బాబు, మహానాడులో ఏమి చెప్పారో ఒకసారి గుర్తు చేసుకోవాలని తెలిపారు. తెలుగుదేశం పార్టీకి కార్యకర్త పట్టుకొమ్మలాంటి వారని, వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ విస్మరించ కూడదని ఆదేశాలు ఉన్నట్లు తెలిపారు. తెలుగుదేశం కార్యకర్త నుండి బూత్ ఇంచార్జ్, బూత్ ఏజెంట్, నాయకులు, నేతల, కష్టంతోనే ఈరోజు నాకు ఎమ్మెల్యే పదవి వరించిందని తెలిపారు. వైసిపి వికృత చేష్టలు, బూతు పురాణాలకు అడ్డుకట్ట వేయాలన్నారు. నెల్లూరు పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి కోవూరు ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డి, దంపతుల, పై మాజీ ఎమ్మెల్యే నల్లపురెడ్డి ప్రసన్న కుమార్ రెడ్డి, అనుచిత వ్యాఖ్యలు చేశారని, వీటిని గతంలోనే ఖండించామని, మరోసారి సభ వేదిక సాక్షిగా ఖండిస్తున్నానని తెలిపారు. వేమిరెడ్డి కుటుంబానికి ఎల్లవేళలా అండగా ఉంటానని తెలిపారు. అనంతరం పరిశీలికులు వల్లభనేని సుబ్బారావుకు, గ్రామ, మండల కమిటీల ఎన్నిక చేయబడిన పేర్ల నివేదికను అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే రాష్ట్ర ఉపాధ్యక్షులు కంభం విజయరామిరెడ్డి, మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ పొన్నుబోయిన చంచల బాబు యాదవ్, రాష్ట్ర కార్యదర్శులు, మన్నేటి వెంకటరెడ్డి, ఎల్‌సి రమణారెడ్డి, మండలాల పరిశీలికులు, కాకి ప్రసాదరావు, బాణా శ్రీనివాసులు రెడ్డి, బీద గిరిధర్, దొడ్డపనేని రాజా నాయుడు, పుట్టం బ్రహ్మానంద రెడ్డి, ఆర్ వీరేంద్ర చౌదరి, మన్నవ రవిచంద్ర రావు, రైతు అధ్యక్షులు బొల్లినేని వెంకట రామారావు, మండల కన్వీనర్లు సిహెచ్ బయన్న, మధు మోహన్ రెడ్డి, గొంగటి రఘునాథరెడ్డి, గూడా నరసారెడ్డి, చంద్ర మధుసూదన్ రావు, గణపం సుదర్శన్ రెడ్డి, గంజాం రాఘవేంద్ర, ఇతర ముఖ్య నాయకులు, క్లస్టర్, యూనిట్, ఇన్చార్జిలు ఉన్నారు.

## పీజీ పట్నంలో విజయవంతంగా జనసేన గ్రామసభ

**పొదలకూరు, మేజర్‌న్యూస్ :**

గ్రామస్థాయి జనసేన పార్టీ, కార్యకర్తల బలోపేతం కొరకు గ్రామస్థాయి సమీక్ష సమావేశాలు మండలంలోని నారదాసు రవి ఆధ్వర్యంలో ప్రభగిరిపట్నం హరిజనవాడలో ఆదివారం నిర్వహించారు. గ్రామ స్వరాజ్యం కోసం ఉపాధి హామీ పథకం పనులు,గ్రామ అభివృద్ధికి తోడ్పడే పనులు చేపడుతున్న ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో బొబ్బేపల్లి సురేష్ నాయుడు, వాణి భవాని ,సండూరు శ్రీహరి, యనమల మధు, మనోజ్, బండి కొమ్మల ప్రసాద్, దినేష్, భాస్కర్, వినయ్, బొమ్మి రమణయ్య, చాట్ల రమణయ్య, మాముడూరు పెంచలయ్య, బొమ్మి నరసయ్య, చాట్ల నరేష్, బొమ్మి శివయ్య, మాముడూరు వెంకటరామయ్య, పలువురు జనసైనికులు పాల్గొన్నారు.

# చిల్డ్రన్స్ పార్కులో ఘనంగా సిల్వర్ జూబ్లీ వేడుకలు

*(మొదటి పేజీ తరువాయి)*

25 మొక్కలను మంత్రి నారాయణ నాటారు. అనంతరం జ్యోతి ప్రజ్వల చేసి జేఎస్ రెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి మీడియాతో మాట్లాడారు. చిల్డ్రన్స్ పార్క్‌కి రావడం చాలా సంతోషంగా ఉందని, అప్పట్లో మొదటగా నెల్లూరులో గాంధీ పార్క్ ఒక్కటే ఉండేదని, డంపింగ్ యార్డ్‌ని 2000 సంవత్సరంలో చిల్డ్రన్స్ పార్కుగా టీడీపీ ప్రభుత్వం మార్చిందన్నారు. జన్మభూమిలో 70–30 కింద జేఎస్ రెడ్డి పార్కును ఏర్పాటు చేసారని, ఇప్పుడు చిల్డ్రన్స్ పార్క్ ల్యాండ్ మార్కు స్థాయికి ఎదిగిందన్నారు. ఈ పార్కులో 70 మంది పిల్లలు ఒకేసారి ఆడుకొనేలా 28 లక్షలతో ప్లే ఎక్విప్‌మెంట్ ఏర్పాటు చేస్తామన్నారు. వర్చ్యూసా డెవలపర్స్ యజమాని వాయుగుండం వెంకటేశ్వర్లు పార్కు అభివృద్ధికి ముందుకొచ్చారని.. ఆధునీకరణకు 40 లక్షలు ఇచ్చేందుకు అంగీకారం తెలిపరన్నారు. పార్కు రూపురేఖలు మార్చేందుకు లియో కన్సల్టెంట్‌ని పిలిపిస్తానని హామీ ఇచ్చారు. పార్కు కమిటీతో సమీక్షించి డిజైన్ రూపొందిస్తామన్నారు. 46 పార్కులు నెల్లూరు సిటీలో సిద్ధం చేశామని సంతోషం వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం స్వచ్ఛభారత్ అవార్డులను ప్రకటించడం ఆనందంగా ఉందన్నారు. సూపర్ స్వచ్ లీగ్ అవార్డుల కేటగిరీ (జనాభా ప్రాతిపదికన) 10 లక్షల కంటే ఎక్కువ జనాభా కేటగిరీలో విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ వచ్చిందని.. 3 లక్షల నుంచి 10 లక్షలలోపు కేటగిరీలో గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ ఉందన్నారు. 50 వేల నుంచి 3 లక్షల జనాభా కేటగిరీలో తిరుపతి మునిసిపల్ కార్పోరేషన్‌కు అవార్డులు ప్రకటించారన్నారు. అదేవిధంగా మినిస్టీరియల్ అవార్డ్ (స్పెషల్ కేటగిరీ)– గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్.. మినిస్టీరియల్ అవార్డ్ (స్టేట్ లెవెల్)



– రాజమండ్రి మున్సిపల్ కార్పొరేషన్‌కు వచ్చాయని.. రాష్ట్రానికి ఐదు అవార్డులు రావటం సంతోషంగా ఉందన్నారు. వచ్చే ఏడాదికి మరిన్ని అవార్డులు సాధించేందుకు కృషి చేస్తానన్నారు. నెల్లూరు సిటీలో స్వీపింగ్ మిషన్‌లతో రోడ్లు శుభ్రం చేస్తున్నామని, మరో 28 స్వీపింగ్ మిషన్స్ కూడా కార్పొరేషన్‌కి కేటాయించామని తెలిపారు. ఎండ్ టు ఎండ్ రోడ్ల పనులు పూర్తి చేసి మిషన్‌లతో శుభ్రం చేసే కార్యక్రమం ప్రారంభిస్తామన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ రూప్ కుమార్ యాదవ్,టీడీపీ సీనియర్ నేత వేమిరెడ్డి విజయభాస్కర్ రెడ్డి మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ తాళ్లపాక అనురాధ, నగర టీడీపీ అధ్యక్షులు మామిడాల మధు, కార్పొరేటర్లు శ్రీకాంత్ రెడ్డి, కర్తం ప్రతాప్ రెడ్డి, పార్క్ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు రామ్మూర్తి, పెద పెంచల ప్రసాద్, ట్రెజరర్ ప్రసాద్ కమిటీ సభ్యులు, వాకర్స్ పాల్గొన్నారు.

### కిడ్నీ రోగుల వర ప్రదాయినిగా

# డయాలసిస్ కేంద్రం




*(మొదటి పేజీ తరువాయి)*

చేయించుకుంటున్నారు. వీరికి ప్రస్తుతం రెండు షిఫ్టలలో డయాలసిస్ జరుగుతోంది. త్వరలో మరో షిఫ్ట్ ప్రారంభించనున్నట్లు సామాజిక ఆరోగ్య కేంద్రం సూపరిండెంట్ డాక్టర్ ప్రసాద్ తెలిపారు. ప్రస్తుతం సైదాపురం, మనుబోలు, చేజర్ల, కలువాయి, రాపూరు, పొదలకూరు మండలాల్లోని కిడ్నీ రోగులు ఇక్కడ డయాలసిస్ సేవలు పొందుతున్నారు. వీరి కోసం ఒక డాక్టర్, ఇద్దరు టెక్నీషియన్లు, ఇద్దరు సిబ్బందిని కేటాయించి సేవలు అందిస్తున్నారు.

### హాస్పిటల్ అభివృద్ధిలో సోమిరెడ్డి పాత్ర ప్రత్యేకం..

**సుధీర్ నాయుడు, సీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ సభ్యులు**



పొదలకూరు సామాజిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటులో సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి స్థానం ప్రత్యేకం. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సామాజిక ఆరోగ్య కేంద్రంగా మార్చడంతో పాటు దాదాపు రూ.4 కోట్లతో భవన నిర్మాణం ఏర్పాటు చేయించి అన్ని వసతులు కల్పించారు. అలాగే హాస్పిటల్‌కు వచ్చే రోగులకు శుద్ధి జలాలను అందించాలనే ఉద్దేశంతో సొంత నిధులతో ఆర్వో ప్లాంట్ ను ఏర్పాటు చేయించారు. అలాగే డయాలసిస్ కేంద్రం ఏర్పాటుతోపాటు భవన నిర్మాణ పనుల కోసం తన సొంత నిధులు 3 లక్షల రూపాయలు ఖర్చు చేశారు. పేదల ఆరోగ్యం కోసం తపన పడే ఎమ్మెల్యే చంద్రమోహన్ రెడ్డి సార్‌కి పొదలకూరు ప్రాంత ప్రజల తరపున కృతజ్ఞతలు తెలుపుతున్నాను.

### ప్రమాణాలు పాటించని హెూటల్లపై

# కఠిన చర్యలు తప్పవు

*(మొదటి పేజీ తరువాయి)*




చేశారు. ఈ సందర్భంగా ఆయా హెూటళ్ల ట్రేడ్ లైసెన్స్, ఎన్‌ఓసి సర్టిఫికెట్‌లు తనిఖీ చేశారు. వంటశాలల్లో నిర్వహణ తీరును పరిశీలించి నిర్వాహకులను వివరణ కోరారు. చెఫ్‌ల వ్యక్తిగత పరిశుభ్రత మెరుగుపరచాలని, వారి ఆరోగ్య ధ్రువీకరణ పత్రాలను అందజేయాలని ఆదేశించారు. నిర్దేశించిన స్థాయిలో హెూటళ్లలో ప్రమాణాలు మెరుగు పరుచుకునేలా నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. అనంతరం డాక్టర్ మాట్లాడుతూ.. నగర పాలక సంస్థ కమిషనర్ వైఓ నందన్ ఆదేశాల మేరకు నగర వ్యాప్తంగా అన్ని వ్యాపార వాణిజ్య కేంద్రాల్లో పారిశుధ్య నిర్వహణ, నిర్దేశించిన ప్రమాణాల తనిఖీలను క్రమం తప్పకుండా నిర్వహిస్తున్నామని తెలిపారు. గతంలో మాగుంట లేఔట్ ప్రాంతంలోని మండి హెూటల్‌ను తనిఖీ చేసి ప్రమాణాలు మెరుగుపరుచుకోవాలని నోటీసులు జారీ చేశామని, అనంతరం జరిపిన తనిఖీలలో హెూటల్ వారు మెరుగైన ప్రమాణాలను ఆచరిస్తున్నట్లు గుర్తించామని తెలిపారు. అదేవిధంగా ప్రభుత్వం నిషేధించిన సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడకంపై ప్రజలంతా పూర్తిగా అవగాహన పెంచుకుని, క్రయ విక్రయాల సమయంలో సాధారణ సంచులను మాత్రమే వినియోగించాలని డాక్టర్ చైతన్య కోరారు. నగర వ్యాప్తంగా ఉన్న అన్ని రెస్టారెంట్లు, హెూటల్లు, క్యాటరింగ్ సంస్థల ప్రాంగణాలు, చిన్నస్థాయి ఆహార తయారీ విక్రయ కేంద్రాలలో ఆహార భద్రత సంస్థ నిర్దేశించిన ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని, త్వరలో నెల్లూరు నగర పాలక సంస్థ ఆహార ప్రమాణాల భద్రతా సంస్థలు సంయుక్తంగా తనిఖీలు నిర్వహించనున్నామని డాక్టర్ చైతన్య తెలిపారు. కార్యక్రమంలో నెల్లూరు నగరపాలక సంస్థ శానిటేషన్ విభాగం అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# చారిత్ర్యాత్మికప్రాధాన్యత కలిగిన శ్రీ అలఘునాధస్వామి ఆలయం





**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరు పట్టణంలోని తూర్పువీధి ప్రాంతంలో ఉన్న శ్రీదేవి, భూదేవిసమేత శ్రీశ్రీశ్రీ అలఘునాధస్వామి ఆలయం అత్యంత ప్రాచీనచరిత్ర, స్థల మహత్మ్యం కలిగినదికాగా నిత్యధూపధీపనైవేద్యాలతో, భక్తుల విశేషాదరణతో దినదిన ప్రవర్ధమానంగా విరాజిల్లుతోంది. ఈ ఆలయానికి దాదాపు 778 సంవత్సరాల చరిత్ర కలిగి ఉండగా అత్యంత స్థలమహత్మ్య ఉందని భక్తులఅపారవిశ్వాసం. తెలుగుచోళరాజులచే నిర్మితమైన ఈ ఆలయంలో శ్రీదేవి, భూదేవి అమ్మవార్లు, శ్రీ అలఘునాధస్వామిలు శ్రీకృష్ణదేవరాయలచేత పూజలందుకున్నారని చరిత్ర ఆధారాలున్నాయి. ఆలయంలో మూలానక్షత్రం సందర్భంగా శనివారం సాయంత్రం స్వామి, అమ్మవార్ల కళ్యాణోత్సవం అత్యంత వైభవంగా అర్చకులు విశ్వనాధం శ్రీనివాసమూర్తి ఆధ్వర్యంలో నిర్వహించారు. స్థానిక ఆర్యవైశ్య సంఘీయులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. భక్తులు విరివిగా పాల్గొనగా ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా పర్యవేక్షించారు. ఈ ఆలయం క్రమీణా జీర్ణావస్థకు చేరుకోగా దశాబ్ధం క్రితం భక్తులు ఒక కమిటీగా ఏర్పడి ఆలయ ఈజర్ణోద్ధరణకు పూనుకున్నారు. 2013లో ప్రభుత్వ సాయం, దాతల విరాళాలు సేకరించి ఆలయాన్ని సర్వాంగసుందరంగా నిర్మించి విగ్రహ ప్రతిష్ట మహోత్సవాలు నిర్వహించారు. అప్పటినుండి ఆలయంలో నిత్యధూప ధీపనైవేద్యాలతో కొనసాగుతుండగా కళ్యాణోత్సవాలు, ప్రత్యేక పండుగల కార్యక్రమాలు, ప్రతిఏటా బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తుండగా భక్తుల ఆదరణ విశేషంగా పెరిగింది. నిత్యపూజలు, హనుమాన్‌చాలీసా, విష్ణుసహస్రనామపారాయణం, శ్రవణానక్షత్రం సందర్భంగా స్వామి, అమ్మవార్ల కళ్యాణోత్సవాలు, ముక్కోటి ఏకాదశినాడు ప్రత్యేకపూజలు, తదితరాలతో భక్తులకొంగుబంగారంగా విలసిల్లుతోంది. ఆలయకమిటీ ప్రతినిధులు, అర్చకులు విశ్వనాధం శ్రీనివాసశర్మ ఆధ్వర్యంలో నిరాటంకంగా కార్యక్రమాలు నిర్వహిస్తున్న అలఘునాధుని ఆలయం దినదినప్రవర్ధమానంగా వెలుగొందుతోంది. బ్రహ్మోత్సవాల సందర్భంగా తిరుమల అర్చకులచే కళ్యాణోత్సవం నిర్వహిస్తుంటారు. అన్నప్రసాదవితరణ కార్యక్రమం, అన్నమాచార్య సంకీర్తన కార్యక్రమాలు, కోలాటాలు, గ్రామోత్సవం తదితరాలను అత్యంత వైభవోపేతంగా, కోలాహలంగా నిర్వహిస్తుంటారు. ఆలయ పున:నిర్మాణానికి, బ్రహ్మోత్సవాలకు నేటి రాష్ట్ర దేవాదాయశాఖామంత్రి ఆనం రామనారాయణరెడ్డి, డిసిసిబ్యాంక్ చైర్మెన్ మెటుకూరు ధనుంజయరెడ్డిలు కూడా అప్పట్లో తమవంతుగా సహకారమందించారు. ఆలయ జీర్ణోద్ధరణ కార్యక్రమంలో బిజెపి నాయకులు కుడుముల సుధాకర్‌రెడ్డి, రిటైర్డ్ గెజిటెడ్ హెడ్మాస్టర్ కె.వి.శేషారెడ్డిలు కీలకంగా వ్యవహరించారు. కమిటీ ప్రతినిధులంతా కంకణదారులై ఆలయాన్ని అత్యంత సుందరంగా పునర్నిర్మించారు. ఆలయంలో అత్యంత ఆకర్షణీయంగా ధ్వజస్థంభాన్ని ఏర్పాటు చేశారు. ఇటీవల అత్యాధునికంగా కళ్యాణమండపాన్ని కూడా ఆలయ ప్రాంగణంలో నిర్మించారు. ఆలయం పునరుద్ధరణజరిగి 12సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఆగస్టునెలలో 5, 6, 7వ తేదీల్లో మహాకుంభాభిషేకాన్ని అత్యంత ఘనంగా నిర్వహించేలా ఏర్పాట్లలో ఉన్నారు.

# పంటపాలెంలో తత్వజ్ఞ హాస్పిటల్ ఉచిత వైద్య సేవలు

## 104 మందికి ఉచిత వైద్య పరీక్షలు



**ముత్తుకూరు, మేజర్‌న్యూస్ :** ముత్తుకూరు మండల కేంద్రంకు చెందిన తత్వజ్ఞ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఆదివారం పంటపాలెం గ్రామ సచివాలయం నందు ఉచిత వైద్య శిబిరం జరిగింది. హాస్పిటల్ అధినేత, ప్రముఖ వైద్య నిపుణులు డాక్టర్ కె.తిరుమల సారధ్యంలో కార్యక్రమం నిర్వహణ సాగింది. స్థానిక అధికార పార్టీ నాయకులు పల్లం రెడ్డి రామ్మోహన్ రెడ్డి, పల్లం రెడ్డి శ్రీధర్ రెడ్డి విచ్చేసి ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. వారితో పాటు గ్రామస్తులు సహకారం అందించారు. మధ్యాహ్నం రెండు గంటల వరకు జరిగిన ఉచిత వైద్య శిబిరంలో 104 మంది ఉచిత వైద్య సేవలు తీసుకున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ కే తిరుమల సాధారణ వ్యాధులకు ఉచిత వైద్య ఆరోగ్య పరీక్షలు చేయగా డాక్టర్ మిధుల శ్రీ గుణపాటి స్త్రీల సంబంధిత వ్యాధులకు వైద్య పరీక్షలు చేశారు. వైద్య పరీక్షలు అనంతరం ఆయా వ్యాధులకు సంబంధించి అవసరమైన రోగులకు ఉచితంగా మందులు పంపిణీ కార్యక్రమం జరిగింది. పల్లం రెడ్డి సోదరులు చేతుల మీదగా మందులు పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమం గురించి అధికార పార్టీ నాయకులు మాట్లాడారు. హాస్పిటల్ అభివృద్ధికి సహకారం ఇస్తామన్నారు. పేదలకు ఉచిత వైద్యం చేయడం హర్షనీయమన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు రామ్మోహన్, శీను, హాస్పిటల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యలను పరిష్కరించండి



**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** మెట్ట ప్రాంతమైన నియోజకవర్గంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని ఎమ్మెల్యే కాకర్ల సురేష్‌కు యూడీఎఫ్ ప్రతినిధులు షేక్ ఎండీ ఖాజా, వీ.రామచంద్రమూర్తిలు సూచించారు. ఈ మేరకు ఆదివారం వారు మండలంలోని గంగిరెడ్డిపల్లికి వచ్చిన ఆయనకు సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. నియోజకవర్గంలో వర్షాధారం, చిన్న సాగునీటి వనరులపై ఆధారపడి రైతులు పంటలు సాగు చేస్తున్నారన్నారు. వర్షాలు కురిసే సమయంలో నీరు వృథా కాకుండా చెరువులు, చెక్ డ్యాంలకు మరమ్మత్తులు చేపట్టాలన్నారు. అలాగే గండిపాళెం, మర్రిపూట్ల, నక్కలగండి రిజర్వాయర్లను ఆధునికీకరించాలన్నారు.. ఉదయగిరి, వింజమూరు వైద్యశాలల స్థాయిని వంద పడకలకు పెంచడంతోపాటు ఉదయగిరిలో డయాలసిస్ కేంద్రం ఏర్పాటు చేయాలన్నారు. ఉదయగిరి, కొండాపురం, తెల్లపాడు, చినక్రాకలో మూతపడ్డ యునాని, ఆయుర్వేద వైద్యశాలలను తెరిపించాలన్నారు. నియోజకవర్గాన్ని సాంకేతికపరంగా అభివృద్ధి చేయడంతో గంగిరెడ్డిపల్లికి మంజూరైన మైనారిటీ కళాశాల పనులు ప్రారంభించేలా చూడాలన్నారు. చారిత్రాత్మక ప్రదేశమైన ఉదయగిరి దుర్గాన్ని పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కంభం విజయరామిరెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి మన్నేటి వెంకటరెడ్డి మండల నాయకులు తదితరులు ఉన్నారు.

## విలక్షణ నటుడుని కోల్పోయాం : మిడతల రమేష్



**నెల్లూరు సిటీ, మేజర్‌న్యూస్ :** 1978లో ప్రాణం ఖరీదు చిత్రంతో నటుడిగా ప్రారంభమైన ఆయన నటజీవితం నవ్వించే ఏడిపించే పిసినారుగా భయపెట్టే విధంగా మధ్యతరగతి తండ్రిగా ఒకమామగా ఒకతాతగా అన్ని రకాల విలక్షణ పాత్రలకు న్యాయం చేసిన వ్యక్తి. కోటా శ్రీనివాసరావు మరణించినప్పటికీ తన నటన ద్వారా తెలుగు ప్రజల జ్ఞాపకాలలో మిగిలే ఉంటారు. 1999లో బిజెపి శాసనసభ్యుడిగా విజయవాడ నుండి ఎంపిక కాబడి ఐదేళ్లపాటు మంచి శాసన సభ్యుడిగా రాణించారు. సామాజిక విలువలను సంస్కృతి సాంప్రదాయాలను కాపాడుకుంటూ ఉండాలని నిరంతరం తాపత్రయ పడిన వ్యక్తి కోటా శ్రీనివాసరావు. వివాద రహితుడుగా మంచి నటుడుగా పేరు తెచ్చుకున్న కోటా శ్రీనివాసరావు జీవితం అందరికీ ఆదర్శప్రాయంగా ఉంటుందని రమేష్ సంతాప ప్రకటనలో తెలిపారు.

## బిల్లుపాడులో సుపరిపాలన తొలిఅడుగు



**చేజర్ల, మేజర్‌న్యూస్ :** సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమం భాగంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి వారి ఆదేశాల మేరకు కిమ్స్ డైరెక్టర్ తాళ్ళూరి గిరినాయుడు సూచనలతో చేజర్ల మండలంలోని బిల్లుపాడు గ్రామంలో ఆదివారం ఇంటింటికి వెళ్లి ఏడాది కాలం కూటమి ప్రభుత్వ పనితీరు వివరించి ప్రజల అభిప్రాయాలను తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో చేజర్ల మండల టీడీపీ అధ్యక్షులు షేక్ సిరాజుద్దీన్, క్లస్టర్ కో-కన్వీనర్ నోటి వెంకట రమణారెడ్డి, చేజర్ల మండల ఆర్గనైజింగ్ సెక్రటరీ బిల్లుపాటి వెంకటేశ్వర్లు, భారత్ మహాసేన నాయకులు జువ్విగుంట బాబు, గొర్ల గోపాల్, టీడీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమావేశం



**బోగోలు, మేజర్‌న్యూస్ :** బిట్రగుంట రైల్వే మిక్స్డ్ హై స్కూల్ 1980-81 సంవత్సరానికి చెందిన పూర్వ విద్యార్థులు ఆదివారం బిట్రగుంటలోని ఎం.కె కళ్యాణమండపంలో పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సుమారు 70 మంది పూర్వ విద్యార్థులు వారి కుటుంబ సభ్యులు ఒక చోటికి చేరి నాటి పాఠశాలలో చదివిన భావ కాలాన్ని గుర్తు చేసుకున్నారు. తాము ఉన్నత స్థాయికి చేరెందుకు కృషిచేసిన ఉపాధ్యాయులను గుర్తు చేసుకున్నారు.

## విద్యుత్ షాక్ తో నాలుగు గేదెలు మృతి



**పొదలకూరు, మేజర్‌న్యూస్ :** విద్యుత్ షాక్‌తో నాలుగు గేదెలు మృతి చెందిన సంఘటన మండలంలోని నావూరుపల్లిలో ఆదివారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన ఇమ్మడిశెట్టి చిన్న పెంచలయ్య కు చెందిన గేదెలు మేత కోసం పొలానికి వెళ్లాయి. ఈ క్రమంలో అదే గ్రామానికి చెందిన గాజుల శ్రీనివాసులు సాగుచేసిన వరి పొలానికి అనధికారికంగా సమీపంలోని కరెంట్ స్థంభం నుంచి వాగు మీదుగా వైరు ద్వారా విద్యుత్ ఏర్పాటు చేసుకున్నాడు. వాగులోకి నీళ్ల కోసం దిగిన నాలుగు గేదెలు విద్యుత్ వైర్లు తగిలి మృతి చెందాయి. మృతిచెందిన గేదెల విలువ సుమారు మూడు లక్షల రూపాయల వరకు ఉంటుందని బాధితుడు వాపోయాడు. ఈ మేరకు పొదలకూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

# మాస్టారు.. మాస్టారు.. మంచి మార్గం చూపారు




గత స్మృతులు గుర్తు చేసుకున్న పూర్వ విద్యార్థుల బృందం

**ముత్తుకూరు, మేజర్‌న్యూస్ :** మాస్టారు.. మాస్టారు మంచి మార్గాన్ని చూపారంటూ చదువు చెప్పిన గురువులను ప్రశంసిస్తూ పూర్వ విద్యార్థిని విద్యార్థులు వారికి పాదాభివందనం చేసి ఆశీస్సులు తీసుకున్నారు. ఈ మరపురాని సంఘటనతో విద్యాభ్యాసం చేసిన గురువులు ఆనందంలో మునిగిపోయారు. ఆదివారం ఈదురు ఈశ్వరమ్మ జడ్పీ ఉన్నత పాఠశాలలో 2002-07 పదవ తరగతి పూర్వ విద్యార్థిని విద్యార్థుల గెట్ టుగెదర్ (పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం) కార్యక్రమం జరిగింది. ఈ బ్యాచ్ పదవ తరగతి చదువుతున్నప్పుడు సరస్వతి దేవి విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మొదట చదువుల తల్లికి పూజలు చేశారు. పూర్వ విద్యార్థులైన పామంజి మనోజ్, బైనా ప్రభు కుమారులు సంయుక్తంగా ఈ విగ్రహానికి తుది మెరుగులు దిద్దారు. ఆర్థికంగా, శారీరక శ్రమను నిర్వహించారు. చదువు చెప్పిన గురువులు దస్తగిరి, అరుణ, విద్యులత, పద్మజ, రాజ, రియాజ్, సృజన్, ఆర్ఆర్ఎస్ ప్రసాద్, భాస్కరయ్య, రామకృష్ణ, సారాభాయ్, మధుసూదన్ రావు, వెంకట రమణయ్య లను గౌరవిస్తూ సభా వేదిక పైన కూర్చోబెట్టి ఆశీస్సులు తీసుకున్నారు. సాలువాలు కప్పి పూలమాలలు వేసి ఘనంగా సత్కరించారు. అదేవిధంగా జ్ఞాపికలు అందజేశారు. గురువులు తమ ఏ విధంగా బెత్తం దెబ్బలు కొట్టారో గుర్తు చేసుకుంటూ గురువులకు చెప్పి ఆనందపడ్డారు. పూర్వ విద్యార్థులు తమ జీవన శైలి గురించి తెలియజేసుకున్నారు. అనంతరం ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి గురువులు మాట్లాడారు. ప్రస్తుతం ఉపాధ్యాయ వృత్తి చాలా కష్టంగా ఉందన్నారు. చట్టాలు అనేకం ఉండడంవల్ల విద్యార్థులను దండించాలంటే ఉపాధ్యాయులు ఇప్పుడు భయపడి పోతున్నారని అన్నారు. గతంలో సమాచార హక్కు చట్టం లేదని అందువల్ల ఉపాధ్యాయులు చదువును సక్రమంగా చెప్పినట్లు గురువులు పేర్కొన్నారు. ఇప్పటి చట్టాలు మాదిరైతే అప్పుడు చదువు చెప్పిన ఉపాధ్యాయులు చెరసాలకు వెళ్లే పరిస్థితి ఉండేదని అన్నారు. పూర్వ విద్యార్థులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చదివించుకోవాలని గురువులు సూచించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## పంటకాలువల పూడిక తీత



**వింజమూరు, మేజర్‌న్యూస్ :** వింజమూరులోని శాఖ గ్రంథాలయం సమీపంలో ఉన్న పంట కాలువను పంచాయతీ ఆధ్వర్యంలో పోటీ తీయించారు. పంచాయతీ ఈవో కె రామారావు దగ్గరుండి పూడికతీత పనులను పరిశీలించారు. రానున్న వర్షాకాలం అని దృష్టిలో ఉంచుకొని వర్షపు నీరు నివాసాలలోని మురుగునీరు కాలువ గుండా వెళ్లేందుకు వీలుంటుందని ఆయన తెలిపారు. నీరు నిలవ లేకపోతే దోమలు వృద్ధి చెందే అవకాశం ఉండదని అందువల్ల అనారోగ్య పరిస్థితులు ఏర్పడమన్నారు. పంచాయతీ పరిధిలో మురుగు కాలువలను పూడికతీత పనులను చేపట్టి మురుగునీరు నిల్వ లేకుండా వెళ్లేందుకు అన్ని రకాల చర్యలు చేపడుతున్నట్లు ఆయన తెలిపారు.

## శాకాంబరి అలంకారంలో ఇరుకళల పరమేశ్వరి



**నెల్లూరు కల్చరల్, మేజర్‌న్యూస్ :** మూలాపేటలో వెలసియున్న శ్రీ ఇరుకళల పరమేశ్వరి అమ్మవారికి ఆదివారం శాఖంబరి అలంకారం చేసినారు. అమ్మవారిని కూరగాయలు, పండ్లతో అలంకరించారు. ఈ సందర్భంగా వేలాదిమంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. అలాగే ఆలయంలో అమ్మవారి గీతాలతో వివిధ సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. హాజరైన భక్తులకు దేవస్థానం వారు తీర్థప్రసాదాలను అందజేశారు. ఆలయ కార్యనిర్వహణాధికారి గిరికృష్ణ ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు.

# ఆచారం.. పరమార్థం.. పరమపవిత్రం.. శుభప్రదం..

**పవిత్ర ఆషాడమాసంలో కొత్తకోడళ్లు పుట్టింటికెళ్లేది అందుకే మోడరన్ పోకడలతో ఆటవిడుపుగా భావిస్తున్న కొత్తకోడళ్లు కనుమరుగవుతున్న సంస్కృతి, సాంప్రదాయాలు. ఆషాడమాసం పవిత్రతకు క్రమేణ తగ్గుతున్న ఆదరణ ఆషాడం వచ్చింది. గోరింట పూసింది.**

**నెల్లూరు/వేదాయపాళెం, మేజర్‌న్యూస్ :** మానవుని ఆధునిక జీవన విధానంలో సంస్కృతి, సాంప్రదాయాలు క్రమక్రమంగా కనుమరుగవుతున్నాయి. పాతకాలం నాటి రోజులతో పోల్చి చూస్తే పల్లెల్లో వేదపండితుల సంఖ్యగణనీయంగా తగ్గినట్లు స్పష్టంగా తెలుస్తోంది. తెలుగు పంచాంగం ప్రకారం ఈనెల 8 నుంచి ప్రారంభమైన ఆషాడమాసం ఆగస్టు6 వరకు నెలరోజుల పాటు ఉంటుంది. ప్రతి ఏటా నాల్గవ మాసం, దక్షిణాయనంలో ప్రారంభమయ్యే ఆషాడమాసంలో శయన ఏకాదశి (తొలి ఏకాదశి) వస్తుంది. ఇది శ్రీమహావిష్ణువుకు ఎంతో ప్రీతికర మైన మాసంగా పురాణ ఇతిహాసాల్లో పేర్కొనబడింది. ఎంతో పవిత్రత, ప్రాధాన్యతను సంతరించుకున్న ఆషాడ మాస సాంప్రదాయం ప్రకారం ఆచారం.. పరమార్థం.. శుభప్రదంగా ప్రాచుర్యంలో ఉంది. కొత్తగా వివాహం జరిగి మెట్టినింట అడుగు పెట్టిన కొత్తకోడళ్లను ఆషాడమాసం





వస్తుందంటే ముందుగానే పుట్టింటికి పంపేసే సాంప్రదాయం అనాధిగా వస్తుంది. ప్రధానంగా ఈ సాంప్రదాయం గ్రామీణ జీవనశైలిలో ఒక అందమైన అనుభూతితో కూడిన జ్ఞాపంగా నిలవడంతో పాటు కుటుంబ బాంధవ్యాలను బలపరచే అనుబంధ, ఆచారంగా ఒకప్పుడు పాటిస్తున్నప్పటికీ.. మారుతున్న కాలం తోపాటు ఆధునిక టెక్నాలజీ మరింత అందుబాటులోకి వస్తున్న ప్రస్తుత రోజుల్లో చోటు చేసుకుంటున్న మార్పుల వల్ల మోడరన్ ట్రెండ్ పేరుతో ఫ్యాషన్ పోకడలకు అలవాటుపడిన సమాజ వ్యవస్థలో చోటుచేసుకున్న మార్పుల వల్ల ఆచారం.. పరమార్థం.. శుభప్రదం అనే సత్ సాంప్రదాయాన్ని పాటించే అనుకూల పరిస్థితులు క్రమేణ కనుమరుగవుతున్నాయి. ఈక్రమంలోనే భిన్న మనస్థత్వాలు కలిగిన కొందరు కొత్తకోడళ్లు అత్తవారిళ్లలో కొత్తగా ఉంటుందని.. అవకాశం దొరికితే పుట్టింట్లో వాలిపోయేందుకు ఆసక్తి చూపుతుంటె.. మన తెలుగు సంస్కృతి, సాంప్రదాయాలు, ఆచార వ్యవహారాలు, పద్ధతులను మనసావాచా త్రికరణశుద్ధిగా పాటిస్తూ గౌరవించే మనస్థత్వాలు కలిగిన మరికొందరు కొత్తకోడళ్లు ఆషాడమాసంలో మన పెద్దలు అనాధిగా ఆచరిస్తున్న నియమాలను పాటిస్తూ మెట్టినింటి నుంచి పుట్టింటికి వెళ్లి నెల రోజులు పూర్తయిన తర్వాత తిరిగి అత్తవారింటికి వస్తుండటం విశేషం. ఇదిలా ఉండగా అత్తవారింటికి అలవాటుపడని మరికొందరు కొత్తకోడళ్లు ఆషాడ మాసం పేరుతో ఏకంగా నెలరోజుల పాటు పుట్టింట్లో ఉండాల్సి రావడాన్ని ఆటవిడుపుగా భావిస్తూ.. తన కుటుంబ సభ్యుల మధ్య హాయిగా గడుపుతూ అత్తింటిపై ఉన్నభయాన్ని పోగొట్టుకనే ప్రయత్నాలు చేస్తుండటం విశేషం. పూర్వపు రోజుల్లో చాలావరకు వైద్య సదుపాయలు అందుబాటులో ఉండేవికావు. ఇదేక్రమంలో వచ్చే ఆషాడమాసంలో నవ దంపతులైన భార్యాభర్తలు కలిసి ఉండటం వల్ల గర్భందాల్చిన భార్య ఎండాకాలంలో పురుడుపోసుకునే అవకాశం ఉండటంతో తల్లిబిడ్డలకు అనారో గ్యసమస్యలు ఎదురుకాకూడదనేది ఒక కారణం.. కాగా శీతాకాలంలో చోటు చేసుకునే వాతావరణ మార్పుల వల్ల అంటు వ్యాధులు వ్యాప్తి చెందేందుకు అవకాశాలు ఎక్కువగా ఉన్నందున.. వీటన్నింటినీ దృష్టిలో పెట్టుకొని ఆలోచన చేసిన మన పెద్దలు ఇదే సమయాల్లో వచ్చే ఆషాడమాసం సందర్భాన్ని పురస్కరించుకొని కొత్తకోడళ్లు అత్తల ముఖం చూడరాదని చెప్పి మెట్టినింట నుంచి నెల రోజులపాటు సెలవు తీసుకొని పుట్టింటికి పంపించే సత్సాంప్రదాయానికి శ్రీకారం చుట్టినట్లు నానుడి. పవిత్ర ఆషాడమాసంలో కొత్తకోడలు అత్తముఖం చూడరాదనేందుకు మరో బలమైన కారణం కూడా ఉన్నట్లు ఆనాటి తరాలకు చెందిన మన పెద్దలు చెబుతున్నారు. వర్షాలు పుష్కళంగా కురిసి వ్యవసాయ పనులు ఊపందుకునేది ఆషాడమాసంలోనే కావడంతో ఇంటిల్లిపాది సభ్యులంతా తలొక చేయివేస్తేనే వ్యవసాయం ముందుకు సాగుతుంది. అలాంటప్పుడు కొత్తగా పెళ్లైన జంటలు ఇంటోనే ఉంటే.. కొత్త పెళ్లాల మీద మోజు పెంచుకునే భర్తలు.. భార్యల ముఖం చూడకుండా ఎక్కువ సమయం పంటపొలాల్లో పనిచే ఎందుకు ఉండలేరు కాబట్టి వ్యవసాయ పనుల్లో నిర్లక్ష్యం వహిస్తారనే ఉద్దేశ్యంతో.. ఆషాడమాసంలో కొత్తకోడలు అత్తముఖం చూడరాదనే నెపంతో పుట్టింటికి పంపేవాళ్లని ఆనాటి కాలనికి చెందిన మన పెద్దలు చెబుతుంటారు.

### ఆషాడం వచ్చింది.. గోరింట పూసింది..

పవిత్ర ఆషాడ మాసం వచ్చిందంటే మైదా (గోరింటాకు)తో ఎన్నో రకాల మధురానుభూతులు చోటుచేసుకుంటాయి. అయితే ఒకప్పటి మైదాకు.. ప్రస్తుతం అనుసరించే గోరింటాకు సాంప్రదాయాలకు చాలా తేడా ఉన్నట్లు తెలుస్తోంది. వాస్తవికతను ప్రక్కన బెట్టి.. ఫ్యాషనో పోకడలకు అలవాటుపడిన గోరింటాకు ప్రియులు ఏకంగా రెడీమేడ్ కోన్స్ ద్వారా అందుబాటులోకి వచ్చిన రకరకాల డిజైన్లపై మక్కువ చూపుతున్నారు. రెడీమేడ్ కోన్స్ ద్వారా డిజైన్లను అలంకరించేందుకు ప్రత్యేకంగా డిజైనర్లు కూడా అందుబాటులో ఉండటం గమనార్హం. గ్రామీణ ఎ ందర్యం, సామాజిక బంధాలు, ఆధ్యాత్మిక భావనలు, ఆరోగ్య విలువలను చాటిచెప్పే గోరింటాకు సాంప్రదాయం ప్రతీ డిజైన్లోనూ ఒక నేప థ్యం, జ్ఞాపకంగా ఉండటం విశేషంగా చెప్పవచ్చు.



# గోదావరి జలాలపై సోమిరెడ్డి వ్యాఖ్యలు అభినందనీయం

**బీజేపీ నేత మిడతల రమేష్**

**పొదలకూరు, మేజర్‌న్యూస్ :** సముద్రంలోకి వెళు తున్న గోదావరి జలాలను ఆపమని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు సమర్థనీయంగా ఉన్నాయని బిజెపి నమామి గంగే రాష్ట్ర కన్వీనర్ మిడతల రమేష్ పేర్కొన్నారు. ఆదివారం అయన విలేకరులతో మాట్లాడుతూ.. సంవత్సరానికి 2000 టీఎంసీ లకు పైగా గోదావరి జలాల సముద్రంలోకి పో తుంటే తెలంగాణ మౌనంగా ఉందన్నారు. సము ద్రంలో కలిసే నీటినీ ఆంధ్రప్రదేశ్ మళ్లించుకుం టామంటే తెలంగాణలో త్రాగు, సాగు నీటి కొరత ఏర్పడుతుందని తెలంగాణ లో అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బిఆర్ఎస్ పార్టీలు అభ్యంతరాలు లేవనె త్తుతున్నాయని తెలిపారు. గోదావరి జలాలపై బిఆర్ఎస్, కాంగ్రెస్ చేస్తున్న రాజకీయ రగడకు ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి తనదైన సరళిలో వ్యాఖ్యానించడం హర్షనీయమన్నారు. సముద్రంలోకి పోతున్న నీటిని బిఆర్ఎస్ బిందెల తోను.. కాంగ్రెస్ చెంబులతోను ఆపండి అంటూ సోమిరెడ్డి చేసిన కామెంట్స్ సెటైర్లుగా ఉన్నప్పటికీ వాస్తవాన్ని సరైన సమయంలో సరైన పద్ధతిలో సోమిరెడ్డి ప్రజెంటేషన్ ఇవ్వడం అభినందనీయమ న్నారు. ఆంధ్ర ప్రదేశ్ గోదావరి మిగులు జలాలు వాడుతుందా లేక వరద జలాలు వాడుతుందా అని గోదావరి రివర్ మేనేజ్మెంట్ బోర్డ్ జిఆర్ఎంబీ కేంద్ర జల సంఘానికి లేఖ రాసిందని, గోదావరి రివర్ మేనేజ్మెంట్ బోర్డు సముద్రం దగ్గర నిలబడి సముద్రంలో కలిసే నీరు మిగులు జలమా! వరద జలమా! వారు లెక్కించుకుంటే కాంగ్రెస్, బిఆర్ఎస్‌లకు కొంత జ్ఞానం వస్తుందన్నారు. 1980 నాటి గోదావరి రివర్ మేనేజ్మెంట్ బోర్డ్‌లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో సముద్రంలోకి వెళ్ళేది మిగులు జలమా వరద జలమా చెప్పలేదంటూ ఇప్పుడు లెక్కలు అడుగుతున్నారని, రాష్ట్ర విభజనకు ముందు రాష్ట్ర విభజన తర్వాత సముద్రంలో



కలిసే జలాలను ఆంధ్ర ప్రాంత అవసరాలకు వినియోగించుకుంటే తెలంగాణలో త్రాగునీరు సాగునీరు కొరత ఎలా ఏర్పడుతుందో జిఆర్ఎంబి సంపూర్ణ వివరణ ఇవ్వాలని మిడతల రమేష్ డిమాండ్ చేశారు.

# అభివృద్ధి చేయాలంటే కూటమి ప్రభుత్వానికే సాధ్యం




**జలదంకి, మేజర్‌న్యూస్ :** రాష్ట్ర ప్రజల అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని గట్టుపల్లి టీడీపి నాయకులు కొల్లా రాధాకృష్ణ, దివి శ్రీనివాసులు, పేర్కొన్నారు. రాష్ట్ర అభివృద్ధి కూటమి ప్రభుత్వానికె సాధ్యమన్నారు. టీడీపీ జాతీయ అధ్యక్షులు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పిలుపుమేరకు ఉదయగిరి నియోజకవర్గ కాకర్ల సురేష్ సూచనలతో సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమం జలదంకి మండలంలోని గట్టుపల్లి లో టీడీపీ సీనియర్ నాయకులు కొల్లా రాధాకృష్ణ, టీడీపీ యువ నాయకులు దివి శ్రీనివాసులు, బుట్టి దుర్గబాబు ఆధ్వర్యంలో 287, 288 బూత్ ఇన్‌చార్జ్‌ల నలమోతు చెంచు నాయుడు, దానం వెంకట కృష్ణ కలిసి ఇంటింటికి వెళ్లడం జరిగింది.ప్రతి ఇంటికి వెళ్లి రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు అందరికీ అందుతున్నాయా లేదా, పరిపాలన యొక్క అభిప్రాయం ప్రజలను అడిగి తెలుసుకుని వారికి కరపత్రాలు పంపిణీ చేశారు. రాష్ట్రంలో నారా చంద్రబాబు నాయుడు తోనే సుపరిపాలన సాగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో గట్టుపల్లి టీడీపి నాయకులు నల్లూరి హరి, లింగాల వెంకటేశ్వర్లు, దేవబోయిన గంగాధర్, కమతం లక్ష్మయ్య, మండే మాల్యాద్రి, కొల్లా శ్రీహరి, దమ్ము మదన్, ఎస్.కె సాజీద్, బుట్టి రాఘవులు, దానం భద్రయ్య, బత్తలమాల్యాద్రి తదితరులు పాల్గొన్నారు.

## పాటకు ప్రాణం పల్లవి : మురళీమోహన్ రాజు



**నెల్లూరు/వేదాయపాలెం, మేజర్‌న్యూస్ :** పినాకిని యూత్ వెల్ఫేర్ అసోసి యేషన్ ఆధ్వర్యంలో ఆదివారం విజయవాడ గాంధీనగర్ లోని ఆశిష్ స్టూడియో నందు రాగాల పల్లకి స.రి.గ.మ.మ.ప. కలిసి పాడుదాం కార్య క్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన వ్యాఖ్యాన శిరోమణి డాక్టర్ వేముల హజరత్తయ్య మాట్లాడుతూ.. కళాకా రులు ఆశించే నిజమైన బహుమతి ప్రోత్సాహం మాత్రమే. పూర్వకాలంలో పల్లెల్లో రోజంతా పనిచేసినా, తన మనసుకి నచ్చిన పాటలు విని చేసిన కష్టాన్ని కూడా మరిచిపోయేవారు పాటకు అంత శక్తి ఉంటుందని తెలి పారు. పినాకిని యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు కె.మురళీ మోహన్‌రాజు మాట్లాడుతూ.. పాట మీద ఉన్న ప్రేమతో వివిధ జిల్లాల నుండి విచ్చేసిన కళాకారులు ఏమి ఆశించరు. అటువంటి కళాకారులను అభినందించడం మా బాధ్యతగా భావిస్తున్నాం. మీ పాటలతో ప్రేక్షకులకు ఆనందాన్ని అందించాలని కోరారు. అనంతరం కళాకారులను మొమెంటో, మెడల్ తో సత్కరించారు. ఈకార్యక్రమంలో గాంధీ సోషల్ వెల్ఫేర్ ట్రస్ట్ నిర్వాహకులు గాంధీ నాగరాజన్, ఆర్గనైజర్ పూనిపర్తి కృష్ణవేణి, వివిధ జిల్లాల గాయని గాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీ పర్వతరెడ్డికి నగర ప్రజల్లో పెరుగుతున్న ఆదరణ



**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డికి నగర ప్రజల్లో రోజురోజుకు ఆదరణ పెరుగుతుందని నాలుగో డివిజన్ వైసిపి ఇంచార్జ్ సందాని బాష తెలిపారు. ఆదివారం నెల్లూరు రాంజీ నగర్ నియోజకవర్గ ఆఫీసులో వైఎస్ఆర్సిపి నెల్లూరు సిటీ ఇంచార్జ్ ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డిని 4వ డివిజన్ వైసీపీ ఇన్‌చార్జ్ షేక్ సంధాని భాష కోఆర్డినేటర్ మధు ఆధ్వర్యంలో 100 కుటుంబాలు కలిశారు. ఈ సంద ర్భంగా డివిజన్ కమిటీల్లో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ మహిళలకు, యువతకు ఇలా పలు వర్గాల ప్రజలకు ఇస్తున్న ప్రాధాన్యతను చూసి డివిజన్ ప్రజలు చంద్రశేఖర్‌రెడ్డి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి వారందరిని ఆప్యాయంగా పలకరించి పార్టీ బలోపేతం కోసం కృషి చేయాలని కోరారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి ప్రజల్లో విశేష ఆదరణ లభిస్తుందని జగన్మోహన్‌రెడ్డి ప్రజలకు అండగా చేస్తున్న కార్యక్రమాలే అందుకు నిదర్శనమన్నారు. రాబోయే రోజుల్లో జగన్మోహన్ రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిగా చేసుకోవడమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పని చేయాలని చంద్రశేఖర్ రెడ్డి సూచించారు. ఇటీవల చంద్రశేఖర్ రెడ్డి రెడ్‌క్రాస్ నుంచి గోల్డ్ మెడల్ అవార్డు అందుకున్న సందర్భంగా డివిజన్ ఇంచార్జ్ షేక్ అందాన్ని బాష, కోఆర్డినేటర్ మధు, మహిళా నేతలు, యువత కార్యకర్తలు పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డికి అభినందనలు తెలియజేశారు.

## అమ్మవార్లను దర్శించుకున్న మంత్రి పర్సనల్ సెక్రెటరీ



**బుచ్చిరెడ్డిపాలెం, మేజర్‌న్యూస్ :** మండల పరిధిలోని జొన్నవాడలో వేలసిన ప్రసిద్ధి చెందిన శ్రీ మల్లికార్జున స్వామి కామాక్షితాయి దేవస్థానా నికి విచ్చేసిన నెల్లూరు జిల్లా ఎండోమెంట్ మినిస్టర్ పర్సనల్ సెక్రెటరీ కడారి వివేక్ కుటుంబ సమేతంగా ఆదివారం శ్రీ స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా దేవస్థాన కార్యనిర్వహణాధికారి శ్రీ అర్వభూమి వెంకట శ్రీనివాసులు రెడ్డి ఆలయ మర్యాదలతో అతిథులకు స్వాగతం పలికారు. అనంతరం అతిధులు ఆలయ ప్రదక్షిణం చేసి శ్రీ స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు అతిధిలు గోత్రనామాలతో శ్రీ మల్లికార్జున స్వామి వారికి సహస్రనామార్చన పూజ, శ్రీ కామాక్షితాయి అమ్మవారికి ఖడ్గమాల పూజ శ్రీ లక్ష్మీ గణపతి స్వామి వారికి, శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారికి అష్టోత్తరశతనామార్చన పూజలు నిర్వహించారు. తదుపరి దేవస్థాన కార్యనిర్వహణాధికారి అతిధు లను శేషవస్త్రంతో సత్కరించి, శ్రీవార్ల చిత్రపటం, తీర్థ ప్రసాదాలు అంద జేశారు. ఆలయ అర్చకులు వేదాశీర్వచనం అందజేశారు.

## ఆషాడ మాస సారె సమర్పణ



**బుచ్చిరెడ్డిపాలెం, మేజర్‌న్యూస్ :** మండల పరిధిలోని జొన్నవాడలో వెలసియున్న ప్రసిద్ధి చెందిన శ్రీ మల్లికార్జున స్వామికామాక్షితాయి దేవస్థానంలో 10వ తేదీ నుండి 24వ తేదీ వరకు ఆషాఢ మాసం సంద ర్భంగా శ్రీ కామాక్షితాయి అమ్మవారి ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలం కరించుట జరిగింది. కోవూరు శ్రీ వాసవి ఆర్య వైశ్య భక్త బృందం త్రివేణి, మాధవిల ఆధ్వర్యంలో సుమారు 30 మంది మహిళలు ఆషాడం సారె సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించి, తీర్థప్రసాదములు స్వీకరించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి శ్రీ అర్వభూమి వెంకట శ్రీనివాసులు రెడ్డి భక్త బృందంను స్వాగతించి శ్రీ కామాక్షితాయి అమ్మవారికి ప్రత్యేక పూజ లు చేయించారు. మహిళలు వారి శక్తి కొలది అమ్మవారికి పసుపు, పూలు, కుంకుమ, పండ్లు, గాజులు, స్వీట్, తమలపాకులు, వక్కలు, ఎండు కొబ్బరి, ఉప్పు, కందిపప్పు, బియ్యం, కూరగాయలు, నెయ్యి, తిలకం, దువ్వెన, అద్దం, పౌడర్ పలు రకాల వస్తువులు సమర్పించారు. అనంతరం భక్తులు అమ్మవారి ప్రసాదంగా సారెను స్వీకరించి ముత్తైదు వులు ఒకరికొకరు, వారి బంధువులకు ఇచ్చిపుచుకున్నారు. అనంతరం భక్తులు అధిక సంఖ్యలో అన్నప్రసాదం స్వీకరించారని అర్వభూమి వెంకట శ్రీనివాసులురెడ్డి, సహాయ కమీషనరు, కార్యనిర్వహణాధికారి తెలిపారు.

## పీఐబీ రాష్ట్ర డైరెక్టర్‌గా పి.రత్నాకర్ నియామకం

▸ హర్షం వ్యక్తం చేసిన మాలకొండ రెడ్డి



**వింజమూరు, మేజర్‌న్యూస్ :** ప్రెస్ ఇన్ఫ ర్మేషన్ బ్యూరో ఆంధ్రప్రదేశ్ డైరెక్టర్‌గా పి.రత్నాకర్‌ను నియమించడంపై లోక్ సత్తా ఉద్యమ సంస్థ రాష్ట్ర సమన్వయ కమిటీ సభ్యులు ముడిగండ్ల మాలకొండరెడ్డి హర్షం వ్యక్తం చేశారు ఇండియన్ ఇన్ఫర్మేషన్ సర్వీస్ సీనియర్ అధికారైన రత్నాకర్ ఇప్పటివరకు సీబీసీలో ప్రాంతీయ కార్యాలయం డైరెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. వారు ప్రకాశం జిల్లా కారుమంచి గ్రామంలో జన్మించి ఐఐఎస్ అధికారిగా పనిచేస్తూ నేడు ఆంధ్రప్రదేశ్ ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో డైరెక్టర్‌గా పదవి బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా వారి శ్రేయోభిలాషి సామాజిక ఉద్యమ కార్యకర్త ఎం.మాలకొండరెడ్డి విజయవాడలో వారి నివాసంలో కలిసి ప్రశంసలతో వారిని అభినందించారు. వారు విద్యార్థి దశ నుంచి సామాజిక స్పృహతో కేంద్ర ప్రభుత్వ సమాచార సమాచారాల మంత్రిత్వ శాఖలో వివిధ హెూదాల్లో పనిచేసి సమర్థవంతమైన అధికారిగా పేరు తెచ్చుకున్నారు ఈరోజు పీఐబీ డైరెక్టర్‌గా ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రానికి అధికారిగా నియమించడం అభినందనీయమన్నారు.

# రాజకీయ ఉద్దండుల బరి ఆత్మకూరు











▶ అదనపు పదవుల నియోజకవర్గం ▶ నాడు బెజవాడ, నేడు ఆనం

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరు నియోజకవర్గం ఏర్పడిననాటినుండి చూస్తుంటే అనేకమంది సీనియర్, ప్రాధాన్యత కలిగిన నాయకుల బరిగా ఉండగా ఇక్కడ గెలుపొందేవారికి ఎమ్మెల్యేతోపాటు ప్రత్యేకంగా అదనపు పదవులు లభిస్తాయని చరిత్ర స్పష్టం చేస్తుంది. అదీగాక ఇక్కడ పోటీచేసిన నేతలు వివిద పార్టీల్లో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో నాయకత్వం వహించారు. ఇక్కడ గెలుపొందిన బెజవాడ గోపాల్‌రెడ్డి రాష్ట్ర ముఖ్యమంత్రి పదవిని కూడా చేపట్టారు. ఇక్కడ పోటీచేసిన ముప్పవరపు వెంకయ్య నాయుడు భారత ఉపరాష్ట్రపతి పదవివరకు వెళ్ళడం, జి.సి.కొండయ్య రాష్ట్ర స్థాయి జనతా నాయకుడుగా ఎదిగిన విషయం తెల్సిందే. ఇక్కడ గెలుపొందిన ఎమ్మెల్యేలు మంత్రులుగా, కార్పోరేషన్ చైర్మెన్లుగా అదనపు పదవులు పొందారు. తాజాగా గత ఏడాది జరిగిన ఎన్నికల్లో ఎమ్మెల్యేగా గెలుపొందిన ఆనం రామనారాయణరెడ్డి రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయశాఖా మంత్రిగా కొనసాగుతుండగా గతంలో ఆయన ఇక్కడ ఎమ్మెల్యేగా గెలిచి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఆర్థికశాఖామంత్రి పదవి నిర్వహించారు. 1952లో ఆత్మకూరు నియోజకవర్గం ఏర్పడింది. ఇక్కడ గెలిచినవారు, ఓడినవారు కూడా వివిద రకాలుగా ప్రాధాన్యత కలిగిన నేతలుగా నిలిచారు. ఇక్కడ పోటీచేసి ఓటమిచెందిన బిజెపినేత ముప్పవరపు వెంకయ్యనాయుడు రాష్ట్ర, జాతీయ స్తాయిలో బిజెపి నేతగా, కేంద్రమంత్రిగా పదవులు పొంది చివరగా భారత ఉపరాష్ట్రపతి పదవిపొంది ఐదేళ్ళు కొనసాగారు. 1952లో ఇక్కడ గెలుపొందిన జి.సి.కొండయ్య రాష్ట్రస్తాయి జనతాపార్టీ నాయకుడుగా, వక్తగా, మేధావిగా పేరుగాంచారు. 1955లో గెలుపొందిన బెజవాడ గోపాల్‌రెడ్డి రాష్ట్ర ముఖ్యమంత్రి, కేంద్రమంత్రి, గవర్నర్ పదవులు పొందారు. 1959,62లో గెలిచిన ఆనం సంజీవరెడ్డి రాష్ట్ర మంత్రిగా, రాష్ట్ర, జాతీయస్థాయి కాంగ్రెస్‌నేతగా పదవులు నిర్వహించారు. 1967లో గెలుపొందిన పెళ్ళకూరు రామచంద్రారెడ్డి కోస్తాప్రణాళికాభివృద్ధి చైర్మెన్‌గా వ్యవహరించారు. 1978, 1985, 1989లో ఎమ్మెల్యే అయిన డాక్టర్ బొమ్మిరెడ్డి సుందరరామిరెడ్డి రాష్ట్ర ఆర్థికసంస్థ చైర్మెన్‌గా క్యాబినెట్‌ర్యాంకుతో పదవి పొందారు. 1983లో ఎమ్మెల్యేగా గెలుపొందిన ఆనం వెంకటరెడ్డి రాష్ట్ర మంత్రి పదవి పొందారు. 1989లో ఇక్కడ పోటీచేసిన కర్నాటి ఆంజనేయ రెడ్డి తన వాగ్ధాటితో పార్టీ రాష్ట్ర అధికారప్రతినిధిగా కొనసాగుతున్నారు. 1994, 2004లో ఎమ్మెల్యేగా గెలుపొందిన కొమ్మి లక్ష్మయ్యనాయుడు రాష్ట్ర ఖాదీబోర్డు డైరెక్టర్ పదవిని పొందారు. 1999లో ఎమ్మెల్యేగా గెలుపొందిన బొల్లినేని కృష్ణయ్యనాయుడు అదనపు పదవులు పొందకున్నా స్వంత నిధులతో దేవాలయాలు, కాలువలు నిర్మించి పేరుగడించారు. 1972లో ఎమ్మెల్యేగా గెలుపొందిన కంచర్ల శ్రీహరినాయుడు అదనపుపదవి పొందకున్నా తమ స్వంత పొలాలు 200ఎకరాలను పేదలకు పంచిపెట్టి పేరు గడించారు. 2009లో ఎమ్మెల్యేగా గెలుపొందిన ఆనం రామనారాయణరెడ్డి మున్సిపల్, ఆర్థికశాఖల మంత్రిపదవులు పొంది ఆత్మకూరులో అనూహ్యంగా దాదాపు2వేల కోట్లరూపాయలతో అభివృద్ధిసాధించి అభివృద్ధిప్రదాతగా పేరుగాంచగా 2024లో ఇక్కడ మళ్ళీ గెలుపొంది రాష్ట్ర దేవాదాయశాఖా మంత్రిగా కొనసాగుతున్నారు.

ఆయన గతంలో నందమూరి తారకరామా రావు, నారా చంద్రబాబునాయుడు, వైఎస్‌రాజశేఖర్‌రెడ్డి, నల్లారి కిరణ్ కుమార్‌రెడ్డి, కొణిజేటి రోశయ్యల మంత్రివర్గంలో కూడా మంత్రిగా కొనసా గారు. 2014, 2019లో ఎమ్మెల్యేగా గెలుపొందిన మేకపాటి గౌతంరెడ్డి జగన్మోహన్‌రెడ్డి పాలనలో ఐటి, పరిశ్రమలు, జౌళి, వాణిజ్య తదితర శాఖల మంత్రిగా పదవి పొందారు. ఆయన మృతితో రాజకీయారంగేట్రం చేసిన ఆయన సోదరుడు మేకపాటి విక్రమ్‌రెడ్డి ఎమ్మెల్యేగా ఉప ఎన్నికల్లో గెలుపొందగా అదనపు పదవులు పొందలేదు. మొత్తంమీద ఆత్మకూరులో గెలిచినవారు అధికంగా అదనపు పదవులు పొందడం, ప్రాధాన్యత పొందడం, ఓడినవారుసైతం అత్యంత కీలకపదవులు పొందడం విశేషం, అతిరధమహారధుల బరిగా ఆత్మకూరు నియోజకవర్గం నిలిచింది.

# తహాశిల్దారు కార్యాలయభవన నిర్మాణం పూర్తయ్యేదెన్నటికో..



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరులో అనేక భవనాలు నిర్మాణంలో అర్ధాంతరంగా నిలిచిపోవడం, వాటిని గురించి పట్టించుకొనకపోతుండడం పరిపాటిగా ఉండగా అత్యంత ప్రాధాన్యత కలిగిన మండల రెవిన్యూకార్యాలయ భవనం దశాబ్ధం దాటినా నిర్మాణం పూర్తికాకుండా దర్శనమిస్తుండడం గమనార్హం. ఒకటి కాదు, రెండు కాదు ఏకంగా 12సంవత్సరాల క్రితం శంఖుస్థాపన గావించబడి పనులు ప్రారంభమై శ్లాబ్ లెవల్‌కు చేరగా ఈనాటికీ పూర్తికాకుండా అదేపరిస్థితి కొనసాగుతోంది. ప్రస్థుతం తహాశిల్దారు కార్యాలయం కొనసాగుతున్న బ్రిటిష్‌కాలంనాటి భవనం శిధిలావస్థకు చేరుకోగా వర్షాలకు ఉరుస్తుండడంతో అధికారులు, సిబ్బంది ఇబ్బంది పడుతుండడంతోపాటు రికార్డులు తడిచిపోతాయనే ఆందోళనతో కొనసాగుతున్నారు. భవన పైకప్పుకు తార్పాలిన్ పట్టలు కప్పుకొని కాలం వెళ్ళబుచ్చుతున్నారు. 2012లో అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఆర్థికశాఖామాత్యులు ఆత్మకూరు ఎమ్మెల్యేగా ప్రాతినిద్యం వహిస్తూ దాదాపు 2500కోట్ల రూపాయల నిధులు సాధించి అనేక రోడ్లు, భవనాలు, సంస్థలు, వంతెనలు తదితరాలను సాధించారు. అందులో భాగంగా ఆత్మకూరు మండల రెవిన్యూకార్యాలయ ఆవరణలో తహాశిల్దారు కార్యాలయం, ఆర్డీవో కార్యాలయం, సబ్‌ట్రెజరీ భవనాల నిర్మాణాలకు 3కోట్ల రూపాయలను ఆనం రామనారాయణరెడ్డి మంజూరు చేయించి అప్పటి రెవిన్యూమంత్రి ఎన్.రఘువీరారెడ్డిని రప్పించి శంఖుస్థాపనలు గావించారు. కాగా ట్రెజరీ కార్యాలయం తమ శాఖనిధులు సాధించుకొని భవనం నిర్మించుకొని శిధిలమైన భవనం నుండి నూతన భవనంలోకి మారారు. రెవిన్యూ డివిజన్ కార్యాలయ భవనం నిర్మాణం నిలిచిపోయిఉండగా ఏడాదిన్నర క్రితం అప్పటి కలెక్టర్ చొరవతీసుకొని పనులు పూర్తిచేయించి ప్రారంభోత్సవం గావించి ఆర్డీవో కార్యాలయాన్ని నూతన భవనంలోకి తరలించారు. ఇక తహాశిల్దారు కార్యాలయ భవనం మాత్రం అలాగే శ్లాబ్‌లెవల్‌లో దర్శనమిస్తోంది. అయితే ఈ ఈదపా మళ్ళీ ఆత్మకూరు శాసనసభ్యులుగా ఆనం రామనారాయణరెడ్డి విజయం సాధించడం, రాష్ట్ర దేవాదాయశాఖా మంత్రిగా కొనసాగుతుండడం జరగ్గా






ఆయన ఈ భవనాన్ని పరిశీలించి తాను ఆనాడు మంజూరుచేయించి ఇంకా పూర్తికాకపోవడం బాధాకరమని పేర్కొంటూ పనులు పూర్తిచేసేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కానీ ఇంకా సంబంధిత అధికారులు మాత్రం ఎలాంటి చర్యలు తీసుకున్న దాఖలాలు కానరావడం లేదు. వర్షాకాలంలో అధికారులు, సిబ్బంది తీవ్రంగా ఇబ్బందిపడుతూ ఆందోళన చెందుతున్న పరిస్థితిని గమనించి ఇప్పటికైనా ఈ భవనం నిర్మాణం పూర్తిచేయాలని, రామనారాయణరెడ్డి ఎంతో శ్రద్ధతో నిధులు సాధించిన భవనాన్ని పూర్తిచేసి ఆయన సంకల్పానికి సార్ధకత చేకూర్చాలని సర్వత్రా కోరుతున్నారు.

# హామీలను నెరవేరుస్తున్న కూటమి ప్రభుత్వం : తుమ్మల

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** పేదలసంక్షేమం, అన్ని ప్రాంతాల అభివృద్ధి, అన్నివర్గాల సంక్షేమం సంకల్పంగా, ఎన్నికల సమయంలో ఇచ్చిన అన్నిహామీలను అమలు చేయాలన్న లక్ష్యంగా తమ కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తుందని, అధికారంలోకి వచ్చిన ఈ ఏడాదిలోనే అనేక హామీలు నెరవేర్చామని ఆత్మకూరు పట్టణ తెలుగుదేశం అధ్యక్షుడు తుమ్మల చంద్రారెడ్డి పేర్కొన్నారు. రాష్ట్ర దేవాదాయశాఖామంత్రి ఆనం రామ నారాయణరెడ్డి ఆదేశాలతో ఆయన మున్సిపల్ పరిధిలోని అన్ని వార్డుల్లో ఆయా ప్రాంత టిడిపి నాయకులు, ప్రజాప్రతినిధులతో కలిసి గడపగడపకు వెళుతున్నారు. కరపత్రాలందిస్తున్నారు. ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధిని వివరిస్తున్నారు. పేదలకు ఎలాంటి కష్టంరాకూడదన్న ఉద్దేశ్యంతో ప్రభుత్వం వివిద రకాల సంక్షేమ ఫలాలను అందిస్తుందన్నారు. గత ప్రభుత్వం మిగిల్చిన అప్పులను చెల్లిస్తూనే తామిచ్చిన ప్రతి హామీని నెరవేర్చేదిశగా ప్రభుత్వం ప్రయాణిస్తుందని ఆయన పేర్కొన్నారు. ఇప్పటికే ఎన్టీయార్‌భరోసా పెన్షన్లు మూడునుండి నాలుగువేలకు పెంచి పంపిణీ చేస్తున్నామని, మహిళలకు ఉచితంగా 3వంటగ్యాస్ సిలిండర్లను అందిస్తున్నామని ఆయన పేర్కొన్నారు. గత ప్రభుత్వం కేంద్ర ఆర్థికసంఘ నిధులను పంచాయతీలకు ఇవ్వకుండా పంచాయతీ వ్యవస్థను నిర్వీర్యం చేసిన దశనుండి 15వ ఆర్థికసంఘ నిధులను నేరుగా పంచాయతీలకే పంపిన ప్రభుత్వం తమదని వెల్లడించారు. తల్లికివందనం పథకం ద్వారా బడికెళ్ళే ప్రతి బిడ్డకు 15వేల రూపాయలవంతున కుటుంబంలోని బిడ్డలందరికీ అందించామని ఆయన తెలిపారు. రైతులకు అన్నదాతసుఖీభవ పేరుతో 20వేల రూపాయలను మూడు విడతలుగా ఈనెలలో ఇవ్వనున్నామని తుమ్మల పేర్కొన్నారు. ఆగస్టునెలలో మహిళలకు ఉచిత బస్‌సౌకర్యం అమలు చేయనున్నామన్నారు. అప్పులకుప్పగా మారిన రాష్ట్రాన్ని ఆర్థికంగా గాడినపెడుతూ ఒక్కొక్క హామీని క్రమక్రమంగా నెరవేరుస్తున్నామని ఆయన వివరించారు. ప్రధానమంత్రి, కేంద్ర మంత్రుల సహకారంతో పోలవరం ప్రాజెక్టును పూర్తిచేస్తున్నామని, రాజధాని అమరావతి నిర్మాణం ప్రారంభమైందని, కళకళలాడే రోజులు వస్తున్నాయన్నారు. ఆత్మకూరు నియోజకవర్గంలో సీనియర్‌నాయకుడు, అభివృద్ధిప్రదాత, రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి అభివృద్ధిని అనూహ్యంగా సాధిస్తున్నారన్నారు. ఆత్మకూరు నియోజకవర్గ సర్వతోముఖాభివృద్ధికి ఇచ్చిన మాటప్రకారం ఆయనే ప్రత్యేక శ్రద్ధ, పట్టుదలగా కృషిచేస్తున్నారని, విద్య, వైద్యం, మౌళికవసతులుకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నారని, ఆత్మకూరు మున్సిపాలిటీని ఆదర్శవంతంగా అభివృద్ధి చేస్తామని, నియోజకవర్గంలో



ప్రజల సంక్షేమానికి, అభివృద్ధికి సమప్రాధాన్యత ఇస్తూ నిధులు సాధించి చర్యలు తీసుకుంటామని చంద్రారెడ్డి పేర్కొన్నారు. ఆయనతోపాటు జిల్లా తెలుగుయువత మాజీ ఉపాధ్యక్షుడు పిడికిటి వెంకటేశ్వర్లునాయుడు, మున్సిపల్ కౌన్సిలర్లు, టిడిపి వార్డు, క్లస్టర్, బూత్‌కమిటీ ఇన్‌చార్జ్‌లు, నాయకులు తదితరులు పాల్గొంటున్నారు.

## కేంద్రసాహిత్య అకాడమి అవార్డు గ్రహీతకు సన్మానం



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** కేంద్రసాహిత్య అకాడమి అవార్డు గ్రహీత గంగిశెట్టి శివకుమార్‌ను ఏపి కాట్వా జిల్లా నాయకురాలు, ఉపాధ్యాయిని, రచయిత, పలు అవార్డుల గ్రహీత పార్లపల్లి నాగేశ్వరమ్మ ఆదివారం ఘనంగా సన్మానించి అభినందించారు. ఇటీవల శివకుమార్ కేంద్రస్థాయి సాహిత్యఅకాడమి అవార్డును ప్రముఖుల చేతులమీదుగా అందుకున్నారు. దాంతో నాగేశ్వరమ్మ ఆయనను శాలువా, పుష్పగుచ్ఛంలతో ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు. భవిష్యత్తులు శివకుమార్ మరిన్ని అవార్డులు పొందాలని ఆమె ఆకాంక్షించారు. ఏపి కాట్వా రాష్ట్ర ఉపాధ్యక్షుడు కమతం సుబ్బారావు, జిల్లా, నియోజకవర్గాల నాయకులు కూడా శివకుమార్‌ను అభినందించారు.

## ఆనందోత్సాహాలమధ్య గోరింటాకు ఫంక్షన్



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరు పట్టణంలో ఆదివారం శ్రీ భారతి సంగీత, నృత్యవిద్యాలయంలో ఆర్గనైజర్ కొండూరు అపర్ణాచక్రవర్తి ఆధ్వర్యంలో గోరింటాకు ఫంక్షన్‌ను మహిళలు ఆనందోత్సాహాలమధ్య నిర్వహించారు. ఆషాడమాసంలో గౌరీదేవి ఇంట గోరింటాకు ఉంటుందన్న ప్రతీక కాగా ప్రాచీనసంస్కృతీ సాంప్రదయాలను గుర్తుచేసుకునేలా ఈకార్యక్రమాన్ని నిర్వహించారు. ఆషాడమాసంలో మహిళలు గోరింటాకు పెట్టుకోవడం మంచిదని, శుభప్రదమని, ఆరోగ్యకరమన్న విశ్వాసం అందరిలో ఉంటుంది. ఇలాంటి సంస్కృతీసాంప్రదాయాల కార్యక్రమాలను క్రమం తప్పకుండా నిర్వహించే భారతి సంగీత, నృత్య విద్యాలయ ఆర్గనైజర్ అపర్ణాచక్రవర్తి స్తానిక వైద్యులు డాక్టర్ ప్రణీత్–డాక్టర్ హారికల సంహకారంతో ఆదివారం గోరింటాకు వేడుకలను పండుగలాగా నిర్వహించారు. మహిళలందరూ తమ చేతులకు గోరింటాకు పెట్టుకొని ఈకార్యక్రమంలో పాల్గొన్నారు. ఈసందర్భంగా స్థానిక వైద్యులు డాక్టర్ అరుణ, డాక్టర్ హారికలను ఘనంగా సన్మానించారు. గోరింటాకు పండుగను ప్రతి ఆషాడమాసంలో క్రమం తప్పకుండా నిర్వమించుకుందామని అపర్ణాచక్రవర్తి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు మహిళలు, మహిళా వైద్యులు, న్యాయవాదులు, ఉపాధ్యాయులు, విద్యార్థినిలు తదితరులు పాల్గొన్నారు.

# ఆత్మకూరులో ప్రగతిని పరుగులు తీయిస్తున్న మంత్రి ఆనం



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరు నియోజకవర్గం అభివృద్ధి విషయంలో గత 10సంవత్సరాలుగా పడకేసి ఉండగా నేటి శాసనసభ్యులు, రాష్ట్ర దేవాదాయశాఖా మాత్యులు ఆనం రామనారాయణరెడ్డి వేగంగా ప్రగతిని పట్టాలెక్కిస్తున్నారు. అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే సంక్షేమంతోపాటు అనూహ్యంగా అభివృద్ధి సాధిస్తున్నారు. గతంలో రామనారాయణరెడ్డి ఆత్మకూరు నియోజకవర్గ శాసనసభ్యులుగా వ్యవహరించి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆర్థికశాఖామాత్యులుగా వ్యవహరించారు. అప్పట్లో ఆత్మకూరు నియోజకవర్గానికి దాదాపు 2500కోట్ల రూపాయల నిధులు సాధించి అనేక రహదారులు, వంతెనలు, భవనాలు నిర్మించడంతోపాటు ప్రాంతీయవైద్యశాలను, ప్రభుత్వ పాలిటెక్నిక్‌ను, రెవిన్యూ డివిజన్, మున్సిపాలిటీ, నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో కస్తూర్భాపాఠశాలలు, ఆదర్శపాఠశాలలు, ఐటిఐలు సాధించారు. ఆత్మకూరులో అభివృద్ధికి చిహ్నం ఆనం అనే నానుడి జనాల్లో బలంగా నాటుకుపోయింది. 2024 ఎన్నికల్లో ఆయన టిడిపి తరపున అభ్యర్థికాగానే వైసిపి బలంగా ఉన్న ఈ నియోజకవర్గంలో అభివృద్ధి ప్రదాత వచ్చారు. ఆయన ఇక్కడ ప్రాతినిధ్యం వహిస్తే ప్రగతి పరుగులు తీస్తుందని అందరూ విశ్వశించి అనూహ్యంగా అన్నివర్గాలు ఆయనకు బాసటగా నిలిచి విజయం కట్టబెట్టారు. ఆయన ఎమ్మెల్యేగా ఎన్నికయ్యాక సీనియర్‌గా, గతంలో అనేక మంత్రిత్వశాఖలు నిర్వహించిన నేతగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గుర్తించి ఆయనకు దేవాదాయమంత్రిగా ఎంపికచేశారు. ఆయన పదవి చేపట్టి ఏడాది కాగా తన రాజకీయ, పాలనానుభవంతో ముఖ్యమంత్రి సాన్నిహిత్యంతో, సహచరమంత్రుల సహకారంతో ఆత్మకూరు అభివృద్ధికి కంకణదారుడయ్యారు. టిడ్కో గృహాల్లో రామాలయాన్ని సాధించారు. పంచాయతీరాజ్ అతిధిగృహానికి 1.7కోట్ల రూఊపాయల నిధులు సాధించి శంఖుస్థాపన గావించారు. ఆర్‌అండ్‌బి అతిధిగృహం నిర్మాణం నిలిచిపోయి ఉండగా నిధులు సాధించి పూర్తిచేయించి ప్రారంభింపజేశారు. ఆత్మకూరు మున్సిపాలిటీలో తాగునీరు, రోడ్డు, డ్రైనేజిలకు దాదాపు 65కోట్ల రూపాయలు సాధించారు. నిలిచిపోయి ఉన్న సోమశిల హైలెవెల్‌కెనాల్ నిర్మాణాలు, సోమశిల ప్రాజెకుట్ట ఆఫ్రాన్‌పనులు ప్రారంభింపజేశారు. నియోజకవర్గంలో సిమెంటురోడ్ల నిర్మాణానికి కోట్లాదిరూపాయలను ఉపాధిహామీపథకం ద్వారా మంత్రి ఆనం సాధించగా ఇప్పటికే అనేక రోడ్ల నిర్మాణాలు పూర్తికాగా పలురోడ్లు నిర్మాణంలో ఉన్నాయి. చెరువులు, కాలువల అభివృద్ధికి దాదాపు 100కోట్ల రూపాయలతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. ఆత్మకూరులో ఆయన మంజూరు చేయించిన 100పడకల హాస్పిటల్ ఆయన ప్రతిపాదన, కృషితో జిల్లా వైద్యశాలగా అప్‌గ్రేడ్ కాగా అన్నీ వసతులు సమకూర్చలేదని ముఖ్యమంత్రి, వైద్యశాఖా మంత్రి దృష్టికి తీసుకెళ్ళి 300పడకల హాస్పటల్‌గా అభివృద్ధిచేసేందుకు తీవ్రంగా కృషిచేస్తున్నారు. ప్రభుత్వం ఏర్పడిన ఈ అతికొద్ది సమయంలోనే ముఖ్యమంత్రిని 2దపాలు ఆత్మకూరు నియోజకవర్గానికి రప్పించి పలు అభివృద్ధి పనులకు శ్రీకారంచుట్టడంతోపాటు పలు హామీలు పొందారు. ఐదారు మంది మంత్రులను ఆత్మకూరుకు రప్పించి పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. ఇటీవల ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును ఆత్మకూరుకు రప్పించి నారంపేటవద్ద పారిశ్రామికపార్కును ప్రారంభింపజేయడంతో అనేక పరిశ్రమాలు ఇక్కడ ఏర్పాటుకు అవకాశం ఏర్పడడంతోపాటు ముఖ్యమంత్రి హామీ కూడా లభించింది. దాంతో పరిశ్రమలు రాగవలన్న విశ్వాసం, వేలాదిమంది నిరుద్యోగయువతకు ఉద్యోగావకాశాలు లబించగలవన్న నమ్మకం జనాల్లో బలంగా ఏర్పడింది. నడికుడి–శ్రీకాళహస్తి రైలుమార్గం నత్తనడకన ఉండగా మంత్రి ఆనం దృష్టిసారించారు. త్వరితగతిన పూర్తిచేసేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేయగా ముఖ్యమంత్రి కూడా ఇటీవల ఆత్మకూరులో హామీ ఇచ్చారు. ఆత్మకూరు పట్టణ బైపాస్‌రోడ్డు విస్తరణకు, చెరువువద్ద సుందరీకరణకు, పట్టణం శివార్లలో బైపాస్‌రోడ్డు నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయించి ప్రభుత్వం నుండి నిధులు సాధించే యత్నంలో మంత్రి రామనారాయణరెడ్డి ఉన్నారు. గత 10సంవత్సరాలుగా ఆత్మకూరులో ఎలాంటి అభివృద్ధి లేకుండా ఉన్న విషయం తెల్సిందే కాగా గతంలో నారంపేట వద్ద ఒక పరిశ్రమ ఏర్పాటు అంటూ శిలాఫలకం వైసిపి ప్రభుత్వం వేసినా ఆ పరిశ్రమను అప్పటి ముఖ్యమంత్రి తమ స్వంత జిల్లా కడపజిల్లాకు తరలించుకోవడం తెల్పిందేకాగా నారంపేట పార్కును అభివృద్ధి చేయించి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చేతులమీదుగా ప్రారంభించి పలు పరిశ్రమలు ఏర్పాటు కానున్నాయని సాక్షాత్తు ముఖ్యమంత్రితోనే హామీ ఇప్పించారు. అభివృద్ధిప్రధాతగా పేరుగాంచిన ఆనం రామనారాయణరెడ్డి ఈఏడాది కాలంలోనే చేస్తున్న కృషి, పట్టుదల, సంకల్పం, లక్ష్యం చూస్తుంటే ఆత్మకూరు అభివృద్ధిని గతంలో పరుగులు తీయించిన మంత్రి నేడు ప్రగతిని పట్టాలెక్కిస్తున్నారని, ఇక స్పీడందుకుంటుందని, అనూహ్యంగా ఆత్మకూరు అభివృద్ధి సాధ్యమవుతుందని సర్వత్రా భావిస్తున్నారు. ఆత్మకూరు మున్సిపాలిటీ, నియోజకవర్గంలోని ఆత్మకూరు, అనంతసాగరం, ఏఎస్‌పేట, సంగం, చేజర్ల, మర్రిపాడు మండలాలు జనాలు ఆశించినదానికన్నా మరింతగా అభివృద్ధి సాధ్యమని అందరూ ఎంతో విశ్వాసంగా ఉన్నారు. ఆయన పార్టీపరంగా సభ్యత్వనమోదు, ఇతర పార్టీ కార్యకలాపాల్లో ప్రత్యేకంగా శ్రద్ధచూపుతూ రాష్ట్రంలోనే ద్వితియ స్థానంపొందారు. ఆయనకు దేవాదాయశాఖను ముఖ్యమంత్రి అప్పగించగా నిరంతరం పర్యటిస్తూ రాష్ట్ర అధికారులతో సమీక్షిస్తూ పలు సంస్కరణలు, నిర్ణయాలు తదితరాలతో ఆయన బాధ్యతలను 100శాతం నిర్వహించారన్న పరిస్థితి అటు ప్రభుత్వ అధినేత వద్ద రికార్డు అయిందని కూడా తెలుస్తోంది. ఏదేమైనా ఆత్మకూరు అభివృద్ధి అంటే ఆనంతో సాధ్యం అన్న నానుడి నిజం కాగలదని సర్వత్రా భావిస్తున్నారు.

# పీఎస్‌కే ఇన్ హెూటల్, లలిత కన్వెన్షన్ హాల్‌ను ప్రారంభం

▸ నెల్లూరులో మాధవయ్య సన్స్ అంటే తెలియని వారు లేరు ▸ నూతనంగా వ్యాపారంలో అడుగుపెట్టిన పసుపులేటి బ్రదర్స్ సుబ్రహ్మణ్యం నరసింహ శ్రావణ్‌కు శుభాకాంక్షలు తెలిపిన మంత్రి ▸ భవిష్యత్తులో రాష్ట్ర వ్యాప్తంగా స్టార్ హెూటల్స్ ఏర్పాటు చేసి ఉన్నత స్థాయికి ఎదగాలని కోరిన మంత్రి





**నెల్లూరు అర్బన్/క్రైం, మేజర్‌న్యూస్ :** నెల్లూరు నగరంలోని 46వ డివిజన్ జొన్నలగడ్డ వారి వీధి లో పిఎస్కే ఇన్ హెూటల్.. లలిత కన్వెన్షన్ హాల్‌ను రాష్ట్ర పట్టణ పురపాలక శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ ఆదివారం ప్రారంభించారు. ప్రారంభోత్సవానికి విచ్చేసినటువంటి మంత్రికి మాధవయ్య సన్స్ వారి టీం.. పూల వర్షం కురిపించి ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం శాలువాలు బొకేలతో మంత్రి నారాయణను స్వాగతించారు. ముందుగా హెూటల్ లోని గదులను మంత్రి నారాయణ స్వయంగా పరిశీలించారు. అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడారు. నూతన వ్యాపారంలోకి అడుగుపెట్టిన పసుపులేటి బ్రదర్స్ సుబ్రమణ్యం, నరసింహ, శ్రావణ్ కుమార్‌కు శుభాకాంక్షలు తెలిపారు. పసుపులేటి కుటుంబంతో.. మా కుటుంబానికి అభినవ సంబంధాలు ఉన్నాయన్నారు. సుబ్రహ్మణ్యం నాకు చిన్ననాటి నుండి స్నేహ సంబంధం కలిగిన వ్యక్తి అన్నారు. మాధవయ్య సెన్స్ అంటే నెల్లూరు జిల్లాలోపాటు పక్క జిల్లాలో కూడా తెలియని వారు లేరన్నారు. 60 ఏళ్లుగా ఫర్నిచర్, ప్లైవుడ్, లామినేట్ రంగంలో మాధవయ్య సన్స్ పేరు ప్రఖ్యాతలు గడిచారని తెలిపారు. ఇప్పుడు లలిత గ్రూప్ పెట్టి హెూటల్ రంగంలో కూడా తమ వ్యాపారిని విస్తరింప చేశారన్నారు. ఫర్నిచర్ తరహాలోనే హెూటల్ రంగంలో కూడా వారు రాణించి అభివృద్ధి చెందాలని వారు ఆకాంక్షిస్తున్నట్లు తెలియజేశారు. భవిష్యత్తులో రాష్ట్రవ్యాప్తంగా స్టార్ హెూటల్స్ ఏర్పాటు చేసే స్థాయికి వారు ఎదగాలని మంత్రి ఆకాంక్షించారు. వ్యాపార రంగంలో మంచి పేరు సంపాదించిన మాధవయ్య సన్స్‌కి ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ రూప్ కుమార్ యాదవ్, టీడీపీ సీనియర్ నేత వేమిరెడ్డి విజయభాస్కర్ రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్పర్సన్ తాళ్ళపాక అనూరాధ, నగర టీడీపీ అధ్యక్షులు మామిడాల మధు, డివిజన్ ప్రెసిడెంట్ మహేంద్ర రెడ్డి, కో క్లస్టర్ డాక్టర్ పోకల రవి పాల్గొన్నారు.

# అమ్మవారి సన్నిధిలో సీసీఎల్ అండ్ స్పెషల్ సీఎస్ విజయలక్ష్మి



**నెల్లూరు కల్చరల్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు దర్గామిట్ట లోని శ్రీ రాజరాజేశ్వర దేవస్థానం నందు ఆంధ్రప్రదేశ్ భూపరిపాలన ముఖ్య కార్యదర్శి జి.విజయలక్ష్మి ఐఏఎస్ (సీసీఎల్ అండ్ స్పెషల్ సీఎస్) శ్రీ అమ్మవారి దర్శనార్థం ఆదివారం ఉదయం విచ్చేయడం జరిగింది. ఈ సందర్భంగా దేవస్థాన కార్య నిర్వహణాధికారి ప్రధాన అర్చకులు, వేద పండితుడు, అర్చకులు పూర్ణ కుంభంతో ఘన స్వాగతం పలకడం జరిగింది. అనంతరం శ్రీ సుందరేశ్వర స్వామి వారిని దర్శించుకుని అక్కడనుండి శ్రీ అమ్మవారికి విశేష ఖడ్గమాల పూజ చేయించడం జరిగింది. అనంతరం ప్రధాన అర్చకుడు, వేదపారాయణదారుడు, అర్చకులు వేదమంత్రాలతో ఆశీర్వదించి శేష వస్త్రములు, తీర్థ ప్రసాదములు అందజేయడం జరిగిందని సహాయ కమిషనరు, కార్య నిర్వాహణాధికారి కోవూరు జనార్దన్‌రెడ్డి తెలిపారు. తదుపరి కార్యనిర్వాహణాధికారి జి.విజయలక్ష్మి, ఐఏఎస్‌తో మాట్లాడుతూ.. దేవాదాయ శాఖ భూములు వెబ్ ల్యాండ్ నందు అప్డేషన్‌కు రెవెన్యూ అధికారులకు తగు ఆదేశాలు ఇవ్వవాల్సిందిగా కోరగా అందుకు రివ్యూ జరిగిందని తగు ఆదేశాలు ఇవ్వటం జరుగుతుందని తెలియజేశారు. దేవస్థానంకు ఆనుకొని ఉన్న రెవెన్యూ భూమి నుండి కొంత స్థలం దేవస్థానంకు కేటాయించాలని దీనివలన పార్కింగ్‌కు ఎటువంటి సమస్యలు లేకుండా ఉంటుందని మనవి చేయడం జరిగింది. జి.విజయలక్ష్మి అనుకూలంగా స్పందిస్తూ తగు చర్యలు తీసుకుంటామని తెలియజేయడం జరిగిందని తెలిపారు.

# వైద్య విధానాల్లో ఆధునిక మార్పులు తప్పని సరి : డాక్టర్ ఎం.శ్రావణి రెడ్డి




**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** వైద్య రంగంలో అందివస్తున్న సాంకేతికతపై అవగాహన పెంచుకుని తదనుగుణంగా ముందుకెళ్తే రోగులకు మెరుగైన చికిత్సను అందించడంతో పాటూ వారి జీవన ప్రమాణాలను పెంపొందించేందుకు దోహదపడుతుందని నెల్లూరు అపోలో స్పెషాలిటీ హాస్పిటల్ సీనియర్ పల్మనాలజిస్ట్ డాక్టర్ ఎం. శ్రావణి రెడ్డి పేర్కొన్నారు. పల్మనాలజీ విభాగంలో నేడు మారిన సాంకేతిక చికిత్సా పద్ధతులపై ఆమె ఆదివారం నెల్లూరులో ఇంటర్వెన్షనల్ పల్మనాలజీ అప్డేట్ – 2025 పేరుతో ( కంటిన్యూ మెడికల్ ఎడ్యుకేషన్ ) శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. నెల్లూరు అపోలో స్పెషాలిటీ హాస్పిటల్ మరియు నెల్లూరుజిల్లా పల్మనాలజీ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ శిక్షణా కార్యక్రమం మినర్వా గ్రాండ్ హెూటల్ లో జరిగింది. డాక్టర్ ఎం. శ్రావణి రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ శిక్షణా కార్యక్రమంలో జిల్లా పల్మనాలజీ అసోసియేషన్ ప్రతినిధులు డాక్టర్ గౌరీనాథ్, డాక్టర్ పిట్టి మల్లిమల్లిఖార్జున పాల్గొన్నారు. వారితో పాటూ రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు చెందిన సుమారు 280 మంది వైద్యులు, పీజి విద్యార్థులు, క్రిటికల్ కేర్ సిబ్బంది కూడా పాల్గొన్నారు. ఈ శిక్షణా కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ మెడికల్ కౌన్సిల్ కూడా భాగస్వామ్యం పంచుకుంది. 2 క్రెడిట్ అవర్స్.. మెడికల్ కౌన్సిల్‌కు చెందిన ప్రముఖ శ్వాసకోశ నిపుణులు పాల్గొని బ్రాంకోస్కోపీ, థొరాకోస్కోపీ, (ఎండోబ్రోన్సియల్ అల్ట్రాసౌండ్), ఎయిర్ వే మేనేజ్ మెంట్ వంటి ఆధునిక శ్వాసకోశ చికిత్సా విధానాలపై వారు చేసిన అధ్యయనాలు, అనుభవాలను పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో అపోలో హాస్పిటల్ డైరెక్టర్ మెడికల్ సర్వీసెస్ డాక్టర్ శ్రీరామ్ సతీష్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిణి డాక్టర్ సుజాత, అదనపు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఖాదర్ వలీ, అపోలో హాస్పిటల్ పల్మనాలజిస్ట్ డాక్టర్ కెఆర్ఆర్ ఉమా మహేష్, యూనిట్ హెడ్ బాలరాజు, హాస్పిటల్ వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.




సూర్య

విలేకర్లు కావలెను

తెలుగు పత్రిక రంగంలో అందరి మన్ననలు పొంది పాఠకుల హృదయాలను దోచుకున్న నేటి దినపత్రిక సూర్య నందు విలేకర్లుగా పనిచేయుటకు ఉత్సాహవంతులైన యువతీ యువకులు కావలెను.

కావలసిన సెంటర్లు

నెల్లూరు జిల్లాలోని సంగం, కొడవలూరు, మనుబోలు, అల్లూరు, దగదర్తి, కొండాపురం, కలిగిరి, కలవాయి, విడవలూరు, ఇందుకూరుపేట, కోవూరు, నెల్లూరు పట్టణంలోని దర్గామిట్ట, స్టోన్ హౌస్‌పేట, బాలాజీ నగర్‌లలో విలేకర్లు కావలెను

మీ పూర్తి బయోడేటాతో వారంలోపు క్రింది చిరునామాలో సంప్రదించగలరు.

నేటి దినపత్రిక సూర్య కార్యాలయం
మిలటరీ కాలనీ, రోడ్ నెం.1,ఎల్ఐసి & సిడిడి ఆఫీసు ఎదురుగా, కొండాయపాలెం గేట్ సెంటర్, నెల్లూరు

9000118811, 9000483583


## వైభవంగా గంగాభవాని అమ్మవారికి పొంగళ్లు



**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** మండలంలోని గంగిరెడ్డిపల్లి గ్రామంలో వెలసి ఉన్న అనంతపురి గంగాభవాని అమ్మవారికి ఆదివారం గ్రామస్తులు నెల పొంగళ్లు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు పొంగళ్ల సామాగ్రిని నూతన బుట్టల్లో ఉంచుకుని మేళతాళాలు, బాణసంచా పేలుళ్ల నడుమ గ్రామోత్సవంగా ఆలయానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆలయం చుట్టూ ప్రదక్షణలు నిర్వహించి ఆవరణలో పొంగళ్లు నిర్వహించారు. అనంతరం అమ్మవారికి నైవేద్యం సమర్పించి కాయాకర్పూరం అందజేసి మొక్కులు తీర్చుకున్నారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి, మన ఫౌండేషన్ అధినేత మన్నేటి వెంకటరెడ్డి దంపతులు. టీడీపీ నాయకులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేపట్టారు. భక్తుల సౌకర్యార్థం అన్నప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు.

# జనవాసాల్లోకి కణితి



**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** పట్టణంలోని దేవలాలగడ్డలో ఓ నివాస ఆవరణలోకి ఆదివారం అటవీ ప్రాంతం నుంచి కణితి తాగునీటి కోసం వచ్చి చిక్కుక్కుంది. గమనించిన స్థానికులు అటవీ శాఖాధికారులకు సమాచారం అందించారు. దీంతో ఎల్బీవోలు వెంకటేశ్వర్లు, ప్రసాద్, లక్ష్మీప్రసన్న అక్కడికి చేరుకుని కణితిని పట్టుకునేందుకు ప్రయత్నించగా అది తప్పించుకుని ముళ్లపొదల్లోకి దూరింది. కణితి చుట్టూ కుక్కలు చుట్టుముట్టడంతో అధికారులు స్థానికుల సహకారంతో వాటిని తరిమికొట్టి కణితిని స్వాధీనం చేసుకున్నారు. అనంతరం కణితిని వాహనంలో తీసుకెళ్లి దుర్గం రిజర్వు అటవీ ప్రాంతంలో వదిలిపెట్టారు. అటవీ ప్రాంతంలో నీటి జాడ కనిపిం చడంతో ఇటీవల తరుచుగా వన్యప్రాణులు జనవాసాల్లోకి వచ్చి కొన్ని మృత్యువాత పడుతుండగా, మరికొన్ని గాయాల పాలవుతున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు ఆటవీ ప్రాంతాల్లో నీటి ఏర్పాట్లు చేయాలని పలువురు కోరుతున్నారు.